telugu daily pepar

TGTEL/26/A4369

# వాస్తవ గమ్యం

తెలుగు దినపత్రిక

తెలంగాణ సంపుటి : 01 సంచిక : 31 ఎడిటర్ :కొమ్ము రాజేష్ పేజిలు : 04, వెల రూ. 2రూ/ బుధవారం-15 - జూలై - 2026

## ఒంటిమిట్ట కోదండరామస్వామికి బంగారు కవచాలు - టీటీడీ బోర్డు నిర్ణయాలివే



తిరుమలలో ధర్మకర్తల మండలి సమావేశంలో

పలు నిర్ణయాలకు ఆమోదం

2 పాత భవనాలు తొలగించి దాతల సహకారంలో

నూతన భవనాల నిర్మాణం

2027 సంవత్సరానికి సంబంధించి శ్రీవారి

క్యాలెండర్, డైరీలు ముద్రణకు నిర్ణయం

అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక సమావేశం మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో మిగతా..2లో

## నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి.. రైతులకు మంత్రి తుమ్మల సూచన



ఎల్‌నినో ప్రభావంపై తెలంగాణలోని రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచనలు చేశారు.

మంగళవారం హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్రమంలో

రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు.

తెలంగాణలో 30 నుంచి 35 శాతం తక్కువ వర్షపాతం నమోదయిందని

భారత వాతావరణ విభాగం వెల్లడించిందని తెలిపారు.

హైదరాబాద్, జులై 14: ఎల్‌నినో ప్రభావంపై తెలంగాణలోని రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచనలు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. తెలంగాణలో 30 నుంచి 35 శాతం మిగతా..2లో

## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు



- కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య వివాదం
- శ్రీహరి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న సురేఖ
- సంయమనం పాటించాలన్న మీనాక్షి నటరాజన్

హైదరాబాద్: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి

- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన
- వేగంగా భూసేకరణ పూర్తి చేయడంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం

### అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు



హైదరాబాద్: అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున మిగతా..2లో

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం



- కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణమన్న పొన్నం ప్రభాకర్
- మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శ
- ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని వెల్లడి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, మిగతా..2లో

## మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామన్న కేంద్ర మంత్రి



- 2028 జూన్ 2 నాటికి పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడి హామీ
- వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై ఎదురుచూపులకు తెర.. కేంద్రం కీలక హామీ!
- 253 ఎకరాలు ఇచ్చిన రాష్ట్రానికి కేంద్రం ప్రశంస
- ఆదిలాబాద్‌లో 1,500 ఎకరాల భూసేకరణ
- కేంద్ర సహకారంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం రేవంత్

## బీచ్‌లోనే విమానం ల్యాండింగ్.. ప్రపంచంలోనే ఏకైక ఎయిర్‌పోర్ట్!

- స్కాట్లాండ్‌లో ప్రపంచంలోనే ప్రత్యేకమైన బారా విమానాశ్రయం
- బీచ్ ఇసుకపైనే విమానాల ల్యాండింగ్, టేకాఫ్
- సముద్రపు ఆటుపోట్ల ఆధారంగా నడిచే విమాన సర్వీసులు
- రోజుకు రెండుసార్లు నీటిలో పూర్తిగా మునిగిపోయే రన్‌వే
- ఏవియేషన్ ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్న వింత ఎయిర్‌పోర్ట్





ప్రపంచవ్యాప్తంగా ఎన్నో విమానాశ్రయాలు ఉన్నప్పటికీ, సముద్ర తీరంలో విమానాలు ల్యాండ్ అయ్యే ఏకైక ఎయిర్‌పోర్ట్ స్కాట్లాండ్‌లోని 'బారా' ద్వీపంలో ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలక్షణమైన విమానాశ్రయంగా గుర్తింపు పొందింది. ఇక్కడ విమానాల రాకపోకలను కేవలం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మాత్రమే కాకుండా, సముద్రపు ఆటుపోట్లు కూడా శాసిస్తాయి. బారా విమానాశ్రయంలో రన్‌వే అంటే సాధారణంగా ఉండే కాంక్రీట్ నిర్మాణం కాదు, విశాలమైన ఇసుక తీరమే ఇక్కడ రన్ వేగా మారుతుంది. దీనిని 'ట్రాయ్ మోర్' లేదా 'కాకిల్ స్ట్రాండ్' అని కూడా పిలుస్తారు. సముద్రపు పోటు తగ్గి నీరు వెనక్కి వెళ్ళినప్పుడు గట్టిపడిన ఇసుక నేలపై విమానాలు ల్యాండ్ అవుతాయి. అదే ఆటు (హై టైడ్) సమయంలో ఈ రన్‌వే మొత్తం నీటిలో మునిగిపోతుంది. ఫలితంగా ఆ సమయంలో విమాన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి,

## వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలి

## హర్మూజ్‌లో దాడులపై భారత్ సీరియస్

- పశ్చిమాసియాలో మళ్లీ ముదురుతున్న యుద్ధం
- హర్మూజ్‌లో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మరణం- ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసిన భారత్




ఢిల్లీ : హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన లక్షిత దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే

## రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి.. 700 మందికి ఉద్యోగాలు..



- కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ విస్తరణకు రంగం సిద్ధం
- రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో రెండో ప్లాంట్ నిర్మాణం
- రేపు పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- కొత్తగా 700 మందికి ఉద్యోగాలు, ప్రభుత్వానికి ఏటా రూ.325 కోట్ల ఆదాయం
- పర్యావరణ హితంగా గ్రీన్ ఇండస్ట్రీ ప్రమాణాలతో ప్లాంట్ నిర్మాణం

అమరావతి : ప్రజా ప్రభుత్వ పాలనలో రాయలసీమ పారిశ్రామిక ప్రగతి పథంలో దూసుకుపోతోంది.

## పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!

## ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం

- పాతకాలపు బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలకు సీఎం ఆదేశం
- ఫిర్యాదుల స్వీకరణకు క్రౌడ్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేయాలి
- 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలని సూచన
- ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు
- 22ఏ భూ వివాదాలను పరిష్కరించి అవకాశాలు సృష్టించాలని దిశానిర్దేశం



అమరావతి : ప్రభుత్వ పాలనలో వేగం పెంచేందుకు, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన ఆయన, అవసరం లేని, పాతబడిపోయిన 'బిజినెస్ రూల్స్'ను సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మిగతా..2లో

## మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు ఎక్కడిది?



జగన్ హయాంలో ప్రకృతి వైపరిత్యాలు వల్ల 270 మంది చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా ఎందుకు పలకరించలేదని నిలదీసిన అచ్చెన్నాయుడు

అమరావతి : మత్స్యకార కుటుంబాలను పరామర్శించేందుకు విశాఖ వచ్చిన వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. దీంతో మంత్రి అచ్చెన్నాయుడు సహా పలువురు నేతలు జగన్ మాటలకు గట్టి కౌంటర్లు ఇస్తున్నారు. ఆ క్రమంలో మాట్లాడిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సముద్రంలో కిలో మీటర్లకు నాటికల్ మైళ్లకు తేడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. మిగతా..2లో

telugu daily pepar
వాస్తవ గమ్యం
తెలుగు దినపత్రిక
TGTEL/26/A4369
బుధవారం-15 - జూలై - 2026

# మొదటిపేజి తరువాయి

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి

వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను (ఫ్లీూ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

### వరంగల్ కీలకం

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం

దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.


## నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి.. రైతులకు మంత్రి తుమ్మల సూచన

తక్కువ వర్షపాతం నమోదయిందని భారత వాతావరణ విభాగం వెల్లడించిందని తెలిపారు. వచ్చే మూడు నెలలూ వర్షాభావ పరిస్థితులే ఉండవచ్చని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల లభ్యత కూడా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన సూచించారు. వరి, చెరకు వంటి అధిక నీటి పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వారికి వివరించారు. జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు మంత్రి తుమ్మల వివరించారు. తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే వంగడాలు ఎంచుకోవాలని రైతులకు స్పష్టం చేశారు. వ్యవసాయ, నీటి పారుదల, భూగర్భ జలాలు – భారత వాతావరణ విభాగం సమన్వయంతో రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తామని చెప్పారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. చిరు ధాన్యాల సాగు పెంచాలని హైదరాబాద్‌లోని ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ సూచించిందని గుర్తు చేశారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో వర్షాభావాన్ని ఎదుర్కోవాలని నిపుణులు సూచనలు చేశారని పేర్కొన్నారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

## మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామన్న కేంద్ర మంత్రి

ఢిల్లీ: వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. మరో మూడు, నాలుగు వారాల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2028 జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన సందర్భంగా ఈ హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 253 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించిందని చెప్పారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తన హయాంలో తెలంగాణకు ఎయిర్‌పోర్టులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపైనా కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం 1,500 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు వెల్లడించారు. రక్షణ శాఖకు కూడా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అవసరమని తెలిపారు. దేశవ్యాప్తంగా మరో 100 కొత్త విమానాశ్రయాలను నిర్మించే లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడి సహకారం మరువలేనిదని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కూడా భాగస్వామి కావాలని కోరుకుంటోందని తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ ఐదు శాతం వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

## బీచ్‌లోనే విమానం ల్యాండింగ్.. ప్రపంచంలోనే ఏకైక ఎయిర్‌పోర్ట్!



నీరు తగ్గాక తిరిగి కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. 'లోగాన్ ఎయిర్' అనే సంస్థ గ్లాస్గో నుంచి బారాకు షెడ్యూల్డ్ విమాన సర్వీసులను నిర్వహిస్తోంది. విమానం ల్యాండ్ అయ్యే క్రమంలో ప్రయాణికులకు నీలి సముద్రం, తెల్లటి ఇసుక తిన్నెలతో కూడిన అద్భుత దృశ్యం కనువిందు చేస్తుంది. విమానాల రాకపోకలు లేని సమయంలో ఈ బీచ్ పర్యాటకులకు విహార కేంద్రంగా, నడకకు మరియు ఇతర వినోద కార్యక్రమాలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేకతల వల్లే ఏవియేషన్ ప్రియులు, సాహస యాత్రికులు తప్పక సందర్శించాల్సిన ప్రదేశాల జాబితాలో బారా ఎయిర్‌పోర్టు చోటు సంపాదించుకుంది. ఈ ద్వీపంలో చారిత్రక కిసిముల్ కోట, మనోహరమైన తీర ప్రాంతాలు, సాంప్రదాయ గ్రామాలు వంటి పర్యాటక ఆకర్షణలు మరెన్నో ఉన్నాయి. మే నుంచి సెప్టెంబర్ మధ్య కాలం ఇక్కడి సందర్శనకు అత్యంత అనుకూలమైన సమయం. విమాన మార్గంతో పాటు ఫెర్రీ ద్వారా కూడా ఈ ద్వీపానికి చేరుకోవచ్చు.

## పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!: ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం

### మొదటిపేజి తరువాయి

ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు సరైన నాయకత్వంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేరతాయని స్పష్టం చేశారు. టెక్నాలజీని అనుసంధానం చేస్తూ పాలనలో పారదర్శకత తీసుకురావాలని సూచించారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (+హూఘా) 20 శాతం వృద్ధి సాధించిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలన్నారు.

### దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా మార్చాలి

దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ ఆలయాల పరిసరాల్లో ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రసాదాల నాణ్యతతో పాటు



ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. అదేవిధంగా, ఆర్టీసీ బస్సులు సరైన సమయానికి నడిచేలా చూడాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను పెంచాలని, రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా రైతులకు భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

### ఫిర్యాదుల పరిష్కారానికి క్రౌడ్ సోర్సింగ్

ప్రభుత్వానికి వచ్చే అన్ని ఫిర్యాదుల స్వీకరణకు 'క్రౌడ్ సోర్సింగ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అర్జీని మానవీయ కోణంలో పరిశీలించి, వేగంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ జాబితాలో చేర్చారని, ఇలాంటి వివాదాలను పరిష్కరించడం ద్వారా ఎన్నో అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. శెట్టిపల్లి భూ వివాదం పరిష్కారంతో ప్రభుత్వానికి రూ.900 కోట్ల విలువైన భూమి రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర వర్చువల్‌గా పాల్గొనగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం, ఆర్టీజీఎస్ రూపొందించిన 'గవర్నెన్స్ డట్ నెవర్ స్లీప్స్' మాసపత్రికను సీఎం ఆవిష్కరించారు.

## మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు ఎక్కడిది?

### మొదటిపేజి తరువాయి

సీదిరి అప్పలరాజు కొడుకు అతి వేగంతో బైక్ నడిపి ఒకరి మృతికి కారణమైతే గొడ్డలి పార్టీ నేత విశాఖపట్నం పర్యటనకు వెళ్లారనుకుంటే, శవ రాజకీయాలు చేశాడని మంత్రి మండిపడ్డారు. వారి గురించి మాట్లాడే హక్కే లేదు: ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి వారి ప్రాణాలు కాపాడే చరిత్ర చంద్రబాబుదని తెలిపారు. మత్స్య కారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ కు ఎక్కడిదని దుయ్యబట్టారు. జగన్ హయాంలో ప్రకృతి వైపరీత్యాలు వల్ల 270 మంది చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా ఎందుకు పలకరించలేదని అచ్చెన్నాయుడు నిలదీశారు.

### మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ కు ఎక్కడిది?: మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది కాబట్టే ఘటన జరిగిన 48 గంటల్లోనే బాధితులకు పరిహారం అందించాం. వారికి రూ.10 లక్షలు ఇస్తే వాటిని జగన్ ముష్టి అని మాట్లాడుతున్నారు. కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించిన నీకు రూ.10 లక్షలు ముష్టి లాగే కనిపిస్తాయి. ప్రజలు అమాయకులు కాదు వారికి అన్నీ తెలుసు. మీ ప్రభుత్వ ఉన్నప్పుడు మత్స్యకారులకు కనీసం వలలు కూడా ఇవ్వని మీరు ఇప్పుడు ఇలా మాట్లాడడం చాలా హాస్యాస్పదం.' -అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అప్పుడు పరిహారం ఎగ్గొట్టారు: పరామర్శల పేరుతో జగన్ దొంగ నాటకాలు సిగ్గుచేటని విశాఖ జిల్లా ఇంఛార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మండిపడ్డారు. గత 5 ఏళ్లు మత్స్యకారులను ఏం ఉద్ధరించారని నేడు జగన్ విశాఖ వచ్చారని నిలదీశారు. ప్రమాదం జరిగిన 72 గంటల్లోనే ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు పరిహారం అందజేశామన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందని తెలిపారు. వైఎస్సార్సీపీ ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతయ్యారన్న మంత్రి, కనీసం వాళ్ళకి డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా జగన్ పరిహారం ఎగ్గొట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఫైల్స్ అన్నీ క్లియర్ చేసి మత్స్యకారులకు రూ. 3.15 కోట్లు పరిహారం చెల్లించామన్నారు. మత్స్యకారులకు సబ్సిడీకి వలలు, పడవలు అందిస్తున్నామన్నారు. వారికి ఎప్పుడూ అండగా నిలిచింది టీడీపీ అని స్పష్టం చేశారు. జువ్వలదిన్నె ఘటనలోనూ కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ ప్రయత్నించారని ఆరోపించారు. మత్స్యకారులను రాజకీయంగా వాడుకోవడం తప్ప జగన్ వారికి చేసిందేమీ లేదని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



విమర్శించారు. పరామర్శనా లేక విజయయాత్రనా?: సముద్ర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకార కుటుంబాల పరామర్శ పేరిట విశాఖలో వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ పర్యటన విజయయాత్రలా సాగింది. కారులో నుంచి బయటికొచ్చి చిరునవ్వులతో జగన్ అభివాదం చేస్తుంటే ఆ పార్టీ కార్యకర్తలు జై జగన్, సీఎం, సీఎం అంటూ నినాదాలు చేశారు. జగన్ వెంట విజిల్స్ వేస్తూ కేరింతలు కొట్టారు. బాధిత కుటుంబాలు అంతులేని దుఃఖంలో ఉంటే పరామర్శ పేరుతో ర్యాలీలు చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

## ఒంటిమిట్ట కోదండరామస్వామికి బంగారు కవచాలు - టీటీడీ బోర్డు నిర్ణయాలివే

### మొదటిపేజి తరువాయి



అత్యంత ప్రాధాన్యత నడుమ ప్రారంభమైంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో శ్రీవారి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, మౌలిక వసతుల పెంపు, ఆలయాల అభివృద్ధి తదితర అంశాలపై బోర్డు సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. ఈ ఉన్నత స్థాయి సమావేశానికి టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరితో పాటు పాలకమండలి సభ్యులు, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. టీటీడీ చైర్మన్ అధ్యక్షతన అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో 62 అంశాల అజెండాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుమలలో రూ.2.9 కోట్లతో అదనపు మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అళ్వార్ ట్యాంక్ సమీపంలో షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శ్రీవారి క్యాలెండర్, డైరీలు ముద్రణకు నిర్ణయం: కుమారధార, పసుపుధార డ్యామ్‌ల పటిష్ఠతకు డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపారు. శిథిలావస్థకు చేరిన 12 పాత భవనాలను తొలగించి, దాతల సహకారంతో నూతన భవనాలు నిర్మించాలని బోర్డు నిర్ణయించింది. 2027 ఏడాది శ్రీవారి క్యాలెండర్లు, డైరీల ముద్రణకు బోర్డు నిర్ణయించింది. గతంలో కంటే చాలా తక్కువ ఖర్చుతో ముద్రించనున్నారు. 100 పడకల విశ్రాంతి గదుల నిర్మాణం: కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం వద్ద యాత్రికుల కోసం 100 పడకల విశ్రాంతి గదుల నిర్మాణం, ఈశాన్య మాడవీధుల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ముఖమండపంపై సాలహారం నిర్మాణ పనులకు రూ.2.50 కోట్ల టెండరుకు ఆమోదం తెలిపారు. బంగారు కవచాలు తయారీ: ఒంటిమిట్ట కోదండరామస్వామి మూలవర్లకు టీటీడీ ట్రెజరీలోని కిలో బంగారాన్ని వినియోగించి బంగారు కవచాలు తయారు చేయనున్నారు. ధార్మిక సంస్థల్లో నిరంతర పారాయణంతో పాటు, వేదపారాయణం స్కీమ్ ద్వారా 791 మంది వేదపండితులను నియమించాలని, కళాకారుల పారితోషికాన్ని పెంచాలని బోర్డు తీర్మానించింది. టీటీడీకి 25 ఏళ్లపాటు ఉచిత విద్యుత్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవీస్ సమీపంలో విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విరాళంతో 800 కిలోవాట్ల విండ్ టర్బైన్ జనరేటర్ ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా టీటీడీకి 25 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ లభించనుంది. కాకులమానుతిప్ప వద్ద ఘనవ్యర్థాల శుద్ధికి రూ.5 కోట్లు, ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణకు రూ.2.35 కోట్లు మంజూరు చేశారు.

## వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలి- హార్మూజ్‌లో దాడులపై భారత్ సీరియస్

### మొదటిపేజి తరువాయి

ఈ అధికారిక ప్రకటన వెలువడింది. కాగా, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడి చేయగా, ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. అనంతరం భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. సముద్ర మార్గాల్లో దాడులు పునర్ ప్రారంభం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ప్రశాంతత, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు శత్రుత్వాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. అలాగే శాంతి కోసం చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని కోరింది. అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ప్రపంచ నౌకాయాన మార్గాల్లో అడ్డంకులు లేని రాకపోకలు, సముద్ర వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలోని వాణిజ్య నౌకలు, సైనికేతర కేంద్రాలపై దాడులు ఆగిపోవాలని పేర్కొంది.

### 'క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం'

ఒమన్ తీరంలో అల్ బాహియా, మొంబాసా అనే పేరు గల రెండు నౌకలపై జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రెండు నౌకల్లో మొత్తం 46 మంది సిబ్బంది ఉండగా, వారిలో 30 మంది భారతీయులేనని తెలిపారు. అల్ బాహియాలో పనిచేస్తున్న 12 మంది భారతీయులలో ఒకరు మరణించారని, మరొకరు గాయపడ్డారని పేర్కొన్నారు. మొంబాసాలో ఉన్న 18 మంది భారతీయుల్లో 9 మంది సిబ్బంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని వెల్లడించారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "బాధిత భారతీయ నావికులకు అవసరమైన సహాయం అందేలా చూసేందుకు యూఏఈలోని ఇండియన్ ఎంబసీ, కాన్సులేట్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయ నావికుడు మరణించాడు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలియజేయడానికి మంగళవారం ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌ను భారత్ పిలిపించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. హార్మూజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి, వాణిజ్యానికి మద్దతుగా మేము మా వైఖరిని స్థిరంగా కొనసాగిస్తున్నాం. ఎందుకంటే హార్మూజ్‌లో నౌకాయానం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక, ఇంధన భద్రతను కల్పించడంలో సహాయపడుతుంది" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

### అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం : యూఏఈలోని ఇండియన్ ఎంబసీ

హార్మూజ్‌లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడిలో భారతీయ నావికుడు మరణించడంపై యూఏఈలోని ఇండియన్ ఎంబసీ స్పందించింది. భారతీయ నావికుడి మృతికి సంతాపం తెలిపింది. అక్కడి పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. "అల్ బహియా, మొంబాసా అనే రెండు నౌకలపై జరిగిన దాడుల్లో ఒక భారతీయ నావికుడు



విషాదకరంగా మరణించడం పట్ల మేము సంతాపం తెలియజేస్తున్నాం. అక్కడి పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాం. గాయపడిన వారికి, వారి కుటుంబాలకు అండగా ఉండడానికి స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని యూఏఈలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

### ఇరాన్‌పై యూఏఈ ఫైర్

మరోవైపు, హార్మూజ్‌లో తమ దేశ నౌకలపై దాడుల జరగడంపై యూఏఈ తీవ్రంగా మండిపడింది. ఈ దాడులను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా పేర్కొంది. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని తెలిపింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసినట్లు ప్రకటించింది. ఇరాన్ వెంటనే ఇలాంటి రెచ్చగొట్టే దాడులను నిలిపివేయాలని, అన్ని రకాల ఘర్షణలను షరతులు లేకుండా విరమించాలని, హార్మూజ్‌ను పూర్తిగా తెరవాలని కోరింది. ప్రపంచ

## రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి.. 700 మందికి ఉద్యోగాలు..

### మొదటిపేజి తరువాయి

ముఖ్యంగా కడప జిల్లాలో పెట్టుబడుల వెల్లువ కనిపిస్తోంది. ఇప్పటికే సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ వంటి కీలక ప్రాజెక్టులు జిల్లాలో కొలువుదీరుతుండగా, తాజాగా మరో భారీ పరిశ్రమ విస్తరణకు అంకురార్పణ జరగనుంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమెర్ల వద్ద ఉన్న దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (జులై 15) శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో ఈ విస్తరణ పనులు చేపట్టనున్నారు. రెండు నెలల వ్యవధిలోనే మంత్రి లోకేశ్ ఇదే నియోజకవర్గంలో రెండోసారి పారిశ్రామిక కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం. ఈ ఏడాది మే 22న కొండాపురం మండలంలో 'సెయిల్' సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఇప్పుడు దాల్మియా సిమెంట్ విస్తరణతో ఈ ప్రాంత పారిశ్రామిక ముఖచిత్రం మరింత మారనుంది.

### ఉత్పత్తి సామర్థ్యం, ఉద్యోగాల్లో భారీ పెరుగుదల


దాల్మియా సిమెంట్ సంస్థ రూ.3,100 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ విస్తరణ ద్వారా ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం మైలవరం ప్లాంటులో ఏటా 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోంది. కొత్త ప్లాంట్ విస్తరణ పూర్తయ్యాక క్లింకర్ ఉత్పత్తి సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ఈ విస్తరణ కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా భారీగా పెంచనుంది. ఇప్పటికే ఉన్న ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మంది ఉపాధి పొందుతుండగా, ఈ విస్తరణతో కొత్తగా మరో 700 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతో మొత్తం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 1,650కి చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల రవాణా, లాజిస్టిక్స్ వంటి అనుబంధ పరిశ్రమల్లోనూ అదనపు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

### ప్రభుత్వ ఖజానాకు పెరగనున్న ఆదాయం

ఈ భారీ పరిశ్రమ విస్తరణతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం దాల్మియా సంస్థ పన్నులు, మైనింగ్ రాయల్టీల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.102 కోట్లు చెల్లిస్తోంది. ప్రతిపాదిత విస్తరణ పూర్తయితే ఈ ఆదాయం ఏకంగా రూ.325 కోట్లకు పెరుగుతుందని అంచనా.

### పర్యావరణ హితమే లక్ష్యంగా 'గ్రీన్ ఇండస్ట్రీ'

దాల్మియా సంస్థ రెండో దశ విస్తరణ పనులను కేవలం



వాణిజ్యపరంగానే కాకుండా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అత్యుత్తమ ప్రమాణాలతో 'గ్రీన్ ఇండస్ట్రీ'గా తీర్చిదిద్దనుంది. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌లో 80 శాతాన్ని సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక వనరుల నుంచే సమకూర్చుకోనుంది. మొత్తం ప్రాజెక్ట్ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండేలా గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమలో వాడిన నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో 130 అధిక సామర్థ్య బ్యాగ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయనుండటం విశేషం.

### దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ సంస్థ

ఎనిమిది దశాబ్దాలకు పైగా సిమెంట్, చక్కెర, విద్యుత్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాల్మియా భారత్ గ్రూప్, దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా గుర్తింపు పొందింది. రూ.14,800 కోట్ల వార్షిక టర్నోవర్‌తో, దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 19 సిమెంట్ కర్మాగారాలు, గ్రైండింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది. సుమారు 33,000 మందికి పైగా డీలర్ల నెట్‌వర్క్‌తో వినియోగదారులకు సేవలందిస్తోంది. ఈ సంస్థ భారీ విస్తరణ చేపట్టడం రాయలసీమ పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సంపాదకీయం

## పునర్జాగృత కాంగ్రెస్సే ప్రతిపక్ష బలం

భారతీయ సినిమా చరిత్రలో సీక్వెల్స్ అరుదుగా విజయం సాధించాయి. ప్రేక్షకులు సాధారణంగా ఒరిజినల్ హిట్ సినిమాను చూస్తారు, ఆదరిస్తారు. సీక్వెల్ చూడవచ్చేటప్పటికి కొత్తదనం తగ్గిపోతుంది. కథ నిస్సారమైనదిగా అనిపిస్తుంది. ప్రారంభ సినిమాలో పులకింపజేసిన అనుభూతి అంతగా పునరావృతమవదు. ఇటీవల బాక్సాఫీసు రికార్డులు బద్దలు కొట్టిన 'ధురంధర్' అందుకొక మినహాయింపే అయినా చాలా సీక్వెల్స్ మొదటి హిట్ సినిమా మ్యాజిక్‌ను పునః సృష్టించడంలో విఫలమవుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీని ఆశ్చర్యకరంగా సవాల్ చేసిన ఇండియా కూటమి.. 2029 సార్వత్రిక ఎన్నికలలోనూ అటువంటి పోటీని సమర్థంగా ఇవ్వగలదా? ఇవ్వగలదనే నమ్మకాన్ని ఇండియా కూటమి 2.0 ఏమాత్రం ఇవ్వలేకపోతోంది. దానికి బదులుగా అంతర్గత నిర్మాణాత్మక ప్రక్షాళనతో దేశ పురాతన రాజకీయ పక్షమైన కాంగ్రెస్‌ను పునశ్శక్తిమంతం చేయవలసిన అవసరమున్నదని చాలామంది భావిస్తున్నారు. మరి గత రెండు సంవత్సరాలలో యమునా నదిలో చాలా నీరు ప్రవహించింది. ప్రధాన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పలు పరాజయాలను మూటగట్టుకున్నది. ఇండియా కూటమికి వెన్నెముకగా నిలిచిన వివిధ ప్రాంతీయ పార్టీలు గణనీయంగా బలహీనపడ్డాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత తిరుగుబాట్లతో కుదేలయిపోతోంది. మహారాష్ట్రలో శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) చీలిపోయాయి. ఢిల్లీలో అధికారాన్ని కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ తన ప్రాసంగికతను నిలుపుకునేందుకు నానా ప్రయాసలు పడుతోంది. ఇంకా ఇతర రాష్ట్రాలలోని ప్రతిపక్షాలు అధికారం కోసం ఎంతగా పోరాడుతున్నాయో మనుగడను కాపాడుకునేందుకు అంతగా ప్రాకులాడుతున్నాయి. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమై తమ భావి కార్యాచరణ గురించి సమాలోచనలు జరిపాయి. ఉమ్మడి లక్ష్యం, దార్శనికతతో కంటే 2029 లోక్‌సభ ఎన్నికల అనంతరం నరేంద్రమోదీ తిరిగి అధికారానికి రాకుండా నిలువరించాలనే ప్రగాఢ ఆకాంక్షతో మళ్లీ కలగలసిన రాజకీయ శక్తుల సంకీర్ణంగా ఇండియా కూటమి కనిపిస్తోంది. సమస్యేమిటంటే రాజకీయాలు ఎంతగా అంకగణిత వ్యవహారాలో (ఓట్ల వాటా, సీట్ల సంఖ్య తదితరాలు) అంతగా ప్రజలను సమ్మోహనపరిచే సామర్థ్యం, భావోద్వేగ సంబంధాలతో ముడివడి ఉన్న విషయాలు. సమావేశాలు, సంప్రతింపులతో ఎన్నికల పొత్తులు కుదుర్చుకోవచ్చు. అయితే ఆ పొత్తులలో అవకాశవాదం ఎంతగా ఉన్నదో ఓటర్లు ఇట్టే గ్రహించగలరు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తృణమూల్ కాంగ్రెస్ పాలన అవినీతిమయమని, బీజేపీతో చాటుమాటు ఒప్పందాలు కుదుర్చుకున్నదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మరి ఇప్పుడు తృణమూల్, కాంగ్రెస్ నాయకులు ఒకే వేదిక మీద కనిపిస్తున్నారు! కాంగ్రెస్‌కు విరుద్ధంగా ప్రజలకు బీజేపీ ఒక స్పష్టతనిస్తోంది. ఆ పార్టీ భావజాలంతో మీరు ఏకీభవించకపోవచ్చు, దాని పద్ధతులను మీరు వ్యతిరేకించవచ్చు. అయితే ఆ పార్టీకి నేతృత్వం వహిస్తున్నది ఎవరో ఓటర్లకు తెలుసు, ఆ పార్టీ ఏ లక్ష్యాల కోసం పనే స్తుందో బాగా తెలుసు, అధికారం ఎవరి చేతుల్లో ఉందో కూడా మరీ తెలుసు. వర్తమాన భారత రాజకీయాలలో బీజేపీ ప్రాబల్యం కేవలం నరేంద్ర మోదీకి లభిస్తున్న విశేష ప్రజాదరణ ఫలితం కాదు. ప్రతిపక్షం తరచూ చీలికలు పీలికలై పోతుండడం కూడా అందుకొక కారణం. సదా అంతర్గత జగడాలతో, అనిశ్చిత నాయకత్వాన్ని అందిస్తున్న ప్రతిపక్షం వైపు ఓటర్లు ఎందుకు మొగ్గుచూపుతారు? ఈ వాస్తవం దృష్ట్యా ప్రతిపక్షం తన విధానాలు, తీరుతెన్నులను మౌలికంగా మార్చుకోవల్సిన అవసరం ఉన్నది. ప్రతిపక్షాలు ఎదుర్కొంటున్న సవాలు బహుశా ఇండియా కూటమిని పునరుద్ధరించడం కాకుండా మరింత పాత రాజకీయ శక్తి అయిన కాంగ్రెస్ వ్యవస్థను పునరుజ్జీవింప జేయడమేనని చెప్పవచ్చు. ఇది వర్తమాన రాజకీయ కర్తవ్యం. అదలా ఉంచితే భారత రాజకీయాలకు సంబంధించిన బాగా ఆసక్తికరమైన విశేషం ఈనాటి ప్రాంతీయ పార్టీలలో అనేకం కాంగ్రెస్ విశ్వం నుంచి ప్రభవించినవి కావడమే. మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ మూలాలు కాంగ్రెస్‌లోనే ఉన్నాయి. ఆ ప్రాంతీయ పార్టీలన్నీ కాంగ్రెస్ చీలిక వర్గాలు. నాయకత్వ వివాదాలు, రాజకీయ ఆకాంక్షలు, ప్రాంతీయ రాజకీయాల ఒత్తిళ్ల కారణంగా ఆయా ప్రాంతీయ పార్టీల నాయకులు కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకుని స్వంత పార్టీలను నెలకొలుపుకున్నవారే. అయితే విశాల దృష్టితో చూస్తే వారందరూ ఒకే భావజాల ఆవరణంలో ఉన్నవారే, సందేహం లేదు. ఈ పార్టీలన్నీ తమ నామధేయాలు, రాజకీయ అస్తిత్వాల్లో కాంగ్రెస్ ముద్రను ఎందుకు కొనసాగిస్తున్నాయి? ఇందుకు ఒక కారణమున్నది: అవన్నీ కాంగ్రెస్ గర్భాశయం నుంచి పుట్టినవే. గత నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ కుటుంబం వివిధ ప్రాంతీయ పార్టీలుగా చీలిపోయింది. ఆ క్రమంలో బీజేపీ వ్యతిరేక ఓటు చెల్లాచెదురైపోయింది, విభజితమైపోయింది. మరో బలహీన బీజేపీ వ్యతిరేక కూటమిని నిర్మించడానికి బదులు కాంగ్రెస్ చీలిక వర్గాలను పునరేకీకరించే అవకాశాలను ఎందుకు అన్వేషించకూడదు? ఒక విలీనం లేదా కనీసం పరస్పర అవగాహనతో ఒక వ్యవస్థీకృత రాజకీయశక్తిగా ఏర్పడడం కాంగ్రెస్‌ను పునశ్శక్తిమంతం చేస్తుంది. ఎన్నికలకు కొన్ని నెలల ముందు నానా పార్టీలతో కట్టే కూటమి కంటే పునరుజ్జీవిత కాంగ్రెస్ చాలా మేలు కాదా? ఇదే జరిగితే ప్రతిపక్షాలకు కాంగ్రెస్ ఒక ప్రధాన కేంద్రంగా ప్రభవిస్తుంది. చిన్న చిన్న పార్టీలతో ప్రభావశీలంగా సంప్రతింపులు జరిపేందుకు కాంగ్రెస్‌కు వెసులుబాటు

## ప్రభుత్వ-ప్రైవేట్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల మధ్య అంతరం..




భారతదేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల మధ్య ఫలితాల వ్యత్యాసానికి కారణాలేమిటి? నిర్వహణ విధానాలు, హాస్టల్ సంస్కృతి, ఉపాధ్యాయుల పనితీరు మూల్యాంకనం, కృత్రిమ మేధస్సు నమూనా ద్వారా ప్రభుత్వ విద్యలో సాధ్యమైన మార్పులను ఈ విశ్లేషణలో తెలుసుకోండి. భారతదేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు రెండూ ఒకే జాతీయ విద్యా విధానాలను, పాఠ్య ప్రణాళికలను అనుసరి స్తున్నప్పటికీ వాటి ఫలితాలలో గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా బోర్డు పరీక్షల ఫలితాలు, పోటీ పరీక్షల విజయాలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు, పరిశోధన ఉత్పాదకత, స్టార్టప్ సంస్కృతి, అంతర్జాతీయ భాగస్వామ్యాల విషయంలో ప్రైవేట్ సంస్థలు ముందంజలో ఉంటున్నాయి. సాధారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు కఠిన నియామక ప్రక్రియల ద్వారా ఎంపిక అవుతారు. వారి విద్యార్హతలు, అనుభవం, సేవా భద్రత చాలా సందర్భాల్లో మెరుగ్గా ఉంటాయి. అయినప్పటికీ విద్యార్థుల ఫలితాల్లో ఆశించిన స్థాయి కనిపించకపోవడం ఒక ప్రధాన సవాలుగా మారింది. ప్రైవేట్ సంస్థల్లో ఉపాధ్యాయులపై నిరంతర పనితీరు మూల్యాంకనం ఉంటుంది. విద్యార్థుల ఫలితాలు, తరగతి నిర్వహణ, పరిశోధన, ప్లేస్‌మెంట్ మద్దతు వంటి అంశాల ఆధారంగా బాధ్యతలు నిర్ణయిస్తారు. ఈ విధానం విద్యా ఫలితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది.

### ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ..

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, హాస్టళ్లు వంటివి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, సామాజిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖలు, ఉన్నత విద్యా మండళ్ల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. నవోదయ విద్యా లయాలు, కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి సంస్థలు ప్రజానిధులతో నడుస్తాయి. ఈ సంస్థల ప్రధాన లక్ష్యం అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన విద్యను అందించడం. ముఖ్యంగా పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో విద్య, వసతి, భోజన సదు పాయాలను కల్పించడం వీటి ప్రధాన బాధ్యత.

### ప్రైవేట్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ..

ప్రైవేట్ విద్యాసంస్థలు సాధారణంగా విద్యా ట్రస్టులు, సొసైటీలు, కార్పొరేట్ సంస్థలు లేదా వ్యక్తిగత యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తాయి. వీటిలో ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ, అకడమిక్ మేనేజ్‌మెంట్ టీమ్‌లు, హాస్టల్ మెంటర్లు, కెరీర్ గైడెన్స్ విభాగాలు, ప్లేస్‌మెంట్ సెల్‌లు సమన్వయంతో పనిచేస్తాయి. ప్రైవేట్ సంస్థలు విద్యార్థి ఫలితాలు, ఉపాధి అవకాశాలు, పరిశోధన, సంస్థ బ్రాండ్ విలువపై ఎక్కువ దృష్టి సారిస్తాయి. అందువల్ల ప్రతి విభాగం పనితీరును నిరంతరం కొలుస్తూ అభివృద్ధి కార్యక్ర మాలను అమలు చేస్తుంటాయి.

### హాస్టల్ వ్యవస్థలో ప్రధాన తేడా..

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల మధ్య అత్యంత స్పష్టమైన తేడా హాస్టల్ నిర్వహణలో కనిపిస్తుంది. ప్రభుత్వ హాస్టళ్లు సాధారణంగా సంక్షేమ దృక్పథంతో నిర్వహించబడతాయి. విద్యార్థులకు భద్రత, భోజనం, నివాసం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. అయితే ప్రైవేట్ హాస్టళ్లు కేవలం నివాస కేంద్రాలుగా కాకుండా విద్యాభివృద్ధి కేంద్రాలుగా రూపాంత రం చెందాయి. అక్కడ పర్యవేక్షిత అధ్యయన సమయాలు, ఫ్యాకల్టీ మెంటరింగ్, కమ్యూనికేషన్ శిక్షణ, కోడింగ్ క్లబ్‌లు, పోటీ పరీక్షల కోచింగ్, మాక్ ఇంటర్వ్యూలు, ప్లేస్‌మెంట్ శిక్షణలు నిరంతరం నిర్వహించబడుతున్నాయి. అంటే ప్రభుత్వ హాస్టళు సంక్షేమ కేంద్రాలైతే, ప్రైవేట్ హాస్టళ్లు అభ్యాస కేంద్రాలుగా మారాయి.

### ఉపాధ్యాయుల నాణ్యతలో తేడా ఉందా?

సాధారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు కఠిన నియామక ప్రక్రియల ద్వారా ఎంపిక అవుతారు. వారి విద్యార్హతలు, అనుభవం, సేవా భద్రత చాలా సందర్భాల్లో మెరుగ్గా ఉంటాయి. అయినప్పటికీ విద్యార్థుల ఫలితాల్లో ఆశించిన స్థాయి కనిపించక పోవడం ఒక ప్రధాన సవాలుగా మారింది. ప్రైవేట్ సంస్థల్లో ఉపాధ్యాయులపై నిరంతర పనితీరు మూల్యాంకనం ఉంటుంది. విద్యార్థుల ఫలితాలు, తరగతి నిర్వహణ, పరిశోధన, ప్లేస్‌మెంట్ మద్దతు వంటి అంశాల ఆధారంగా బాధ్యతలు నిర్ణయిస్తారు. ఈ విధానం విద్యా ఫలితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది.

### కృత్రిమ మేధస్సు ప్రభావం

ప్రస్తుతం విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు ఒక విప్ల వాత్మక మార్పుకు నాంది పలుకుతోంది. ఏఐ ఉపాధ్యాయులను భర్తీ చేయడం కాదు, వారి సామర్థ్యాలను పెంచే భాగస్వామిగా పనిచేస్తోంది. ప్రైవేట్ సంస్థలు ఇప్పటికే విద్యార్థుల పనితీరు విశ్లేషణ, వ్యక్తిగతీకరించిన బోధన, ఆటోమేటెడ్ మూల్యాంకనం, ప్లేస్‌మెంట్ అంచనాలు, కెరీర్ మార్గదర్శకతలో ఏఐను వినియోగిస్తున్నాయి. విద్యార్థుల బలహీనతలను ముందుగానే గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించే వ్యవస్థలను అభివృద్ధి చేశాయి. ప్రభుత్వ సంస్థలు కూడా ఏఐ ఆధారిత విద్యార్థి విశ్లేషణ, బహుభాషా డిజిటల్ ట్యూటరింగ్, హాస్టల్ లెర్నింగ్ డ్యాష్‌బోర్డులు, మానసిక ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేస్తే విద్యా నాణ్యతలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి ఒక సమగ్ర నమూనాగా ప్రతిపాదించబడింది. ఈ నమూనాలో నైతిక విద్యార్థి విశ్లేషణ, ఉపాధ్యాయుడూ× భాగస్వామ్యం, సాంస్కృతిక సమగ్రత, స్మార్ట్ హాస్టల్ లెర్నింగ్, ఆధారిత ప్లేస్‌మెంట్ వ్యవస్థలు, మెటావర్స్ ఆధారిత అభ్యాస వేదికలు, హక్కుల ఆధారిత పాలన వంటి అంశాలు ఉన్నాయి. ఈ విధానం ద్వారా హాస్టళ్లను విద్యా కేంద్రాలుగా మార్చి, ఉపాధ్యాయుల పనిభారాన్ని తగ్గించి, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచవచ్చు.

### నిధులు కాదు.. నిర్వహణ సమస్య

ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసం కేవలం భవనాలు లేదా నిధుల సమస్య కాదు. అది నిర్వహణ, హాస్టల్ సంస్కృతి, విద్యా పర్యావరణం, ఉపా ధ్యాయుల వినియోగం, కృత్రిమ మేధస్సు సమర్థ వినియోగానికి సంబంధించినది. భవిష్యత్తు విద్యలో విజయం సాధించేది ు×ని ఉపయోగించే సంస్థలు కాదు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజం మధ్య సహజీవనాన్ని నిర్మించే సంస్థలే. అలాంటి దృక్పథంతో ముందుకు సాగితే ప్రభుత్వ విద్యాసంస్థలు కూడా ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థలుగా ఎదిగి భారతదేశాన్ని జ్ఞాన సమాజంగా తీర్చిదిద్దగలవు.

## ఉద్యమకారులకు న్యాయం దక్కేనా?



అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాటలు నీటి మూటలేనని తేలిపోయింది. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులను కూడా మోసగించిం ది. అమరుల కుటుంబానికి ఒక ఉద్యోగం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి, సంక్షేమ చర్యలు చేపడుతామని మ్యానిఫెస్టోలో తెలిపింది. కానీ ముప్పై నెలలు పూర్తవుతున్నా అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇది రాష్ట్రప్రజల విశ్వాసానికి గట్టి దెబ్బ. ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీలు, ఉపకమిటీలు, అఖిలపక్ష సమావేశాలు, అభిప్రాయ సేకరణలు అంటూ కాలం గడుపుతున్నది. ఉద్యమకారులకు అవసరమైనవి కమిటీలు కాదు, నిర్ణయాలు. ప్రభుత్వం ఒకవైపు అందరికీ ఇవ్వలేం అంటున్నది. మరోవైపు ఉద్యమకారుల ఎంపికకు స్పష్టమైన విధానం ప్రకటించడం లేదు. అయితే మొదట గుర్తింపు రావాల్సింది అమరవీరుల కుటుంబాలకు. ఆ తర్వాత జైళ్లలో నెలల తరబడి ఉన్నవారికి, పోలీసు కేసులు ఎదుర్కొన్నవారికి, ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కోల్పోయిన విద్యార్థులకు, ఉద్యమంలో జీవితాన్ని అంకితం చేసిన కవులు, కళాకారులు, జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలా ఉద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, ఒక్కరేమిటి అన్ని వర్గాలు తమ వృత్తిని వదిలి తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. ఇప్పటికే మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా హామీలు అమలు చేస్తామని చెప్పడంలో చిత్తశుద్ధి కనిపించడంలేదు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. చట్టబద్ధ అధికారాలతో కూడిన కమిషన్ ఏర్పాటు చేయాలి. ఉద్యమకారుల సంక్షేమ కార్పొరేషన్ స్థాపించి, ప్రతి ఏడాదీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. అమరవీరుల కుటుంబాలకు గౌరవ పెన్షన్, విద్య, వైద్యం, ఉపాధి, గృహ భరోసా కల్పించాలి. విద్యార్థి ఉద్యమకారులకు ఉపాధి అవకాశాలు, వడ్డీ రహిత రుణాలు, పరిశ్రమల స్థాపనకు హామీ ఇవ్వాలి. కె.కేశవరావు కమిటీని కాలయాపన వేదికగా కాకుండా చట్టబద్ధ అధికారాలతో కూడిన కమిషన్‌గా మార్చాలి. తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధుల తరహాలో గౌరవించి, వారి సంక్షేమాన్ని ప్రభుత్వ శాశ్వత బాధ్యతగా స్వీకరించాలి. అమరవీరుల త్యాగాలను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి 611 మందికి ఉద్యోగాలు కల్పించి ఆర్థిక సహాయం చేసింది. ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారులకు 550 ఉద్యోగాలు కల్పించింది. సకలజనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చింది. చాలామందికి రాజకీయ పదవులు ఇచ్చింది. కానీ ప్రజలను, ఉద్యమకారులను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే. ఉద్యమ జేఏసీలో భాగస్వాములుగా ఉన్న మేం కేశవరావు కమిటీకి పలు సూచనలు చేశాం. 1969 ఉద్యమం నుంచి 2014 వరకు వివిధ రూపాలలో మరణించిన వారి జాబితా తయారు చేయాలి. ఉద్యమకారుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ. 25,000 పెన్షన్, గృహ వసతి కల్పించాలి. ఉద్యమంలో జైలుకు వెళ్లిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. నిర్బంధాల వలన వైకల్యం లేదా ఇతర సమస్యలు తలెత్తి, ఇబ్బందులు పడుతున్న వారికి కూడా పెన్షన్ సౌకర్యం కల్పించాలి. సకలజనుల సమ్మెలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, వారికి నాయకత్వం వహించిన సంఘాల బాధ్యులకు ప్రభుత్వ కార్యక్రమాలలో తగిన గౌరవం కల్పించాలి. ముఖ్యంగా ఆగస్టు 15, జనవరి 26, జూన్ 2 వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి దాటిన వారికి, విద్యార్హతలు లేని వారికి ప్రభుత్వం రుణాలు ఇప్పించాలి. వివిధ వ్యాపారాలలో స్థిరపడే అవకాశం కల్పించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. భారత ప్రభుత్వం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారికి పెన్షన్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నది. వాటిని పరిశీలించి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి న్యాయం జరిగేలా కృషి చేయాలి. జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న వారికి సమకూర్చిన సంక్షేమాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి. చట్టబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఉద్యమకారుల సంక్షేమం నిరంతర ప్రక్రియగా ఉండాలి. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. తెలంగాణ వైతాళికుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి. ఉద్యమకారులకు వైద్య సదుపాయం కల్పించాలి. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమంపై విషం చిమ్ముతున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వాలి, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేసి ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలి. భారత స్వాతంత్ర్య సమరయోధులకు కల్పించిన తరహాలోనే తెలంగాణ ఉద్యమకారులకు కూడా అన్ని సంక్షేమ ప్రయోజనాలు అందేలా కృషి చేయాలి.

## బడుల మూసివేతను విరమించుకోవాలి

బెంగళూరులో 'ది హిందూ' పత్రిక నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామని ప్రకటించారు. అదే సమయంలో నీతి ఆయోగ్ సమావేశంలో మాట్లాడుతూ దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో 23 వేల పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేస్తూ, మరోవైపు అందుకు విరుద్ధంగా చేస్తున్న ప్రకటనలకు పొంతనలేదు. ఇంకోవైపు నియోజకవర్గానికి ఒకటి చొప్పున నిర్మిస్తామని చెప్తున్న యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కూడా పొంతనలేని ప్రకటనలతో గందరగోళం సృష్టిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులు విద్యార్థి నివసించే ఆవాసానికి సమీపంలో పాఠశాల అందుబాటులో ఉండాలని, ఆ బాధ్యతను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహించాలని 'విద్యా హక్కు చట్టం-2009' చెప్తున్నది. ఆ చట్టంలోని సెక్షన్ 5 (1) (ఏ) (బీ) ప్రకారం ఐదో తరగతిలోపు చదివే విద్యార్థులకు కిలోమీటర్ దూరంలో, ఆపై తరగతులు చదివే విద్యార్థులకు మూడు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వమే పాఠశాల సౌకర్యం కల్పించాలని స్పష్టంగా ఉన్నది. బడ్జెట్‌లో విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని చెప్పి ఇప్పటికీ 8.2 శాతానికి మించట్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్లలో 4వేల పాఠశాలలను మూసివేసింది. మరోవైపు ప్రాథమిక, ఉన్నత పాఠశాలు, ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులు, శాశ్వత సిబ్బంది లేకుండా దివాలా స్థితికి చేరుకుంటున్నాయి. పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం జాతీయ ర్యాంకింగ్‌లో తెలంగాణ 26 నుంచి 28వ స్థానానికి దిగజారింది. దేశంలోని 783 జిల్లాల్లో తెలంగాణలోని 28 జిల్లాలు 300 నుంచి 675 స్థానాల్లో ఉన్నాయి. ఇవి బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ లాంటి వెనుకబడిన జిల్లాలతో సమానంగా ఉన్నాయి. రాష్ట్రంలో బహుళ తరగతి బోధన వలన ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసం కోల్పోయి, అందులో చదివే పిల్లల సంఖ్య తగ్గిపోయింది. ఒక్కో తరగతికి ఒక టీచరు, ఒక గది ఉండేలా చూస్తే ప్రభుత్వ పాఠశాలలకే పిల్లలు వస్తారు. ఆ మేరకు ప్రభుత్వం విశ్వాసం కలిగించే చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న 27 వేల పాఠశాలల్లోని తక్షణ సమస్యల పరిష్కారం పట్ల చొరవ చూపకుండా, రూ.23 వేల కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని అనుకోవడంలో ప్రభుత్వ ఉద్దేశం ఏమిటి? ఇంటిగ్రేటెడ్ పాఠశాలల విధివిధానాలు, పాఠశాలల నిర్వహణ విధానాలు, ఉపాధ్యాయుల నియామకం ఏమీ లేకుండా కులాల గోడలు కూల్చివేస్తామని ఆర్భాటపు ప్రసంగాలతో విద్యా విధానంలో మార్పులు రావు. అన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలలను కేంద్రీకృతం చేస్తూ నిర్వహించబోయే ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోకి విద్యార్థులు ప్రస్తుత ప్రభుత్వ గ్రామీణ పాఠశాలల నుంచే చేరక తప్పదు. ప్రభుత్వ నిర్వహణలోని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ బడుల్లో నమోదు మరింతగా తగ్గుముఖం పట్టి పాఠశాలలు అంతరించి పోయే ప్రమాదం లేకపోలేదు. ఇందుకోసం వ్యయం చేసే కోట్లాది రూపాయల నిధులతో ఇప్పుడున్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ మౌలిక సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఆట స్థలాలు కల్పించే చర్యలు చేపట్టవచ్చు. ఈ పాఠశాలలన్నింటినీ సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్పు చేయవచ్చు. రాష్ట్రంలో ఐదు రకాల గురుకులాలతోపాటు అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, ఏకలవ్య మాడల్ పాఠశాలలు, మూగ, చెవిటి విద్యార్థుల ఆశ్రమ పాఠశాలలతో పది రకాల రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలలతో ప్రభుత్వ రంగంలో ఉన్న అనేక రకాల అంతరాల పాఠశాలలు ఏక రూప విద్యను అందించడం లేదు. ఇప్పుడు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళు ఏర్పాటైతే మరో రెండు రకాల పాఠశాలలు ఉనికిలోకి వస్తాయి. పైన తెలిపిన పాఠశాలలకు అదనంగా మరో రెండు చేరుతాయి.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ డిమాండ్‌తో
# కగజ్ నగర్‌లో కళాశాలల బంద్



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కగజ్ నగర్ మండలం ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను నేడు మూసివేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు దాదాపు రూ.11,000 కోట్లు విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.నిధులు అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకాష్ లోకండే తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అరుణ్, రాకేష్, చైతన్య, ప్రీతం, శుభం, తిరుపతి, అంజన్న, విగ్నేష్‌తో పాటు పలువురు కార్యకర్తల సహకారంతో బంద్ కార్యక్రమం విజయవంతమైంది.

## కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్య వర్గం ఎన్నిక



ఆసిఫాబాద్,**వాస్తవ గమ్యం జూలై 14 :** కొమురం భీమ్ జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అష్ఫాక్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సి. రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం లోని సన్నీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా కుకుడే సంతోష్, ఉపాధ్యక్షులుగా మొహర్లే నాగసాయి, సుప్రం బాలకిషన్, దుర్వా అరుణ్, ప్రధాన కార్యదర్శిగా కాసనగొట్టు అంజయ్య, సంయుక్త కార్యదర్శులుగా నైని రాజు, దుర్వా రూపేష్, కోశాధికారిగా కస్తూరి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఆత్రం భీంరావు, ఒరగంటి శ్రావణ్, మోర్లే గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, జిల్లాలో కిక్‌బాక్సింగ్ క్రీడాభివృద్ధికి సమిష్టిగా కృషి చేసి మరింత మంది యువతను ఈ క్రీడ వైపు ఆకర్షించాలని పిలుపునిచ్చారు.

# ప్రేమ వేధింపుల కేసులో ముగ్గురు అరెస్ట్

### నిందితుడితో పాటు తల్లి,అక్క ను అదుపులోకి తీసుకున్న జైపూర్ పోలీసులు



జైపూర్,**వాస్తవ గమ్యం జూలై 14 :** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన యువతి గోషిక మాధవి ఆత్మహత్య కేసులో జైపూర్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు గోనె వెంకటేష్‌తో పాటు అతని తల్లి గోనె శంకరమ్మ,అక్క గోనె శైలజలను మంగళవారం అదుపులోకి తీసుకుని నేర ఒప్పుకోలు పంచనామా నిర్వహించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు జైపూర్ సీఐ నవీన్ కుమార్ ఎస్సై భూమేష్ తో కలిసి మంగళవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు గోనె వెంకటేష్ కీలక విషయాలను వెల్లడించినట్లు పేర్కొన్నారు.రెండేళ్ల క్రితం గోషిక మాధవితో పరిచయం ఏర్పడిందని,ఆ పరిచయాన్ని ప్రేమగా భావించి ఆమె అంగీకరించకపోయినా నిరంతరం వెంటపడుతూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినట్లు తెలిపాడని,మాధవి పలుమార్లు తిరస్కరించినప్పటికీ ఆమెను వదలకుండా వేధింపులకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు.ఈ విషయాన్ని తన తల్లి శంకరమ్మ,అక్క శైలజకు చెప్పగా వారు కూడా ఆమెను వదలొద్దు అలాగే ప్రయత్నిస్తే చివరకు పెళ్లి జరుగుతుంది అంటూ తనను ప్రోత్సహించినట్లు విచారణలో వెల్లడించినట్లు పంచనామాలో పేర్కొన్నారు.అనంతరం ముగ్గురూ కలిసి యువతి ఇంటికి వెళ్లి పెళ్లి చేయాలని కోరగా,కుల భేదాలు చూపిస్తూ యువతి కుటుంబ సభ్యులు నిరాకరించారని పేర్కొన్నారు.దీంతో పెళ్లి చేయకపోతే ఆమె పేరుతో తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.జూలై 10న గోదావరిఖనిలో మాధవిని కలిసి మరోసారి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసి,అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు వెల్లడించాడు.జూలై 11న పెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలోనూ యువతి కుటుంబం వివాహానికి నిరాకరించడంతో,తన తల్లి, అక్క కలిసి మా వాడికి ఏదైనా జరిగితే ఊరుకోం అంటూ బెదిరించినట్లు విచారణలో పేర్కొన్నారు.నిందితుడు వెంకటేష్ వద్ద ఉన్న వివో కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఆ ఫోన్ ద్వారానే మాధవికి తరచూ కాల్స్ చేసినట్లు నిందితుడు అంగీకరించాడని,ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు పంచనామాలో వెల్లడించారు.అనంతరం శంకరమ్మ,శైలజల వాంగ్మూలాలు కూడా నమోదు చేయగా వారు కూడా ప్రధాన నిందితుడు తెలిపిన వివరాలనే ధృవీకరించినట్లు పోలీసులు తెలియజేశారు.ఈ కేసులో సేకరించిన సాక్ష్యాలు,సూసైడ్ నోట్,మొబైల్ ఫోన్ వివరాలు,నిందితుల వాంగ్మూలాల ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

# ఎల్కంటి లో ఉచిత వైద్య శిబిరం



జైపూర్,**వాస్తవ గమ్యం జూలై 14 :** సింగరేణి యాజమాన్యం,సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ఎల్కంటి గ్రామంలో గల గ్రామపంచాయతీ భవనంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఈడి శ్రీ సిహెచ్ చిరంజీవి మాట్లాడుతూ..ప్లాంట్ ప్రభావిత గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని సింగరేణి యాజమాన్యం సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని,దీని ద్వారా గ్రామ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని,తద్వారా ముందస్తుగా వ్యాధి నివారణ చర్యలు చేపట్టవచ్చు అని అన్నారు. గ్రామస్తులందరూ వాతావరణ మార్పుల దృష్ట్యా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని,తగిన నివారణ చర్యలు చేపట్టాలని,స్వీయ సంరక్షణ పాటించాలని,గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ వైద్య శిబిరం లో 59 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారని,వారికి మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారిగాంలో మొక్కలు నాటిన సత్యసాయి సేవా సమితి



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలం పారిగాం గ్రామంలో భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని గ్రామ సర్పంచ్ చన్నపూరే లావణ్య-కుర్మాజీ, గ్రామ నాయకులు పిలుపునిచ్చారు. మొక్కలు ప్రాణవాయువు అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యత కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు అందరూ మొక్కల పెంపకానికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.చౌదరి నానాజీ, చన్నపూరే ధనరాజ్, బోర్కుట్లె మిట్టు, జాడే గిరిధర్, చన్నపూరే సుధాకర్, చౌదరి దిలీప్, చన్నపూరే అరుణ్, హలకే బాబురావు, నరుల లక్ష్మి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కన్నెపల్లిలో డ్రైడే కార్యక్రమం

### దోమల నివారణపై అవగాహన



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మెర్లె పార్వతి, ఉప సర్పంచ్ మెర్లె సమత-రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఇండ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, కుండీలు, డబ్బాలు, టైర్లు తదితర పాత్రల్లో దోమల లార్వా పెరగకుండా వాటిని శుభ్రం చేయాలని సూచించారు. నిల్వ నీటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే పాటించి దోమల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన పరిసరాలతోనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని సర్పంచ్ మెర్లె పార్వతి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆశా వర్కర్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎల్ 1 జాబితాలోని కచ్చా ఇండ్లపై క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక అందించాలి

### కలెక్టర్ కె.హరిత





ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల పథకంపై సమీక్ష సమావేశం జరిగింది.ఎల్ 1 జాబితాలోని కచ్చా ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులు పరిశీలించి నివేదికలు వెంటనే అందించాలని, ఏమైనా సమస్యలు ఉంటే గృహ నిర్మాణ శాఖ పి.డి. దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎల్ 1 జాబితాలో నమోదైన కచ్చా ఇండ్ల సంఖ్య 2,300 కాగా, ఇప్పటివరకు 1,800 ఇండ్ల పరిశీలన పూర్తయిందని, మిగతా 500 ఇండ్ల పరిశీలన చేయాల్సి ఉందని తెలిపారు. గెజిటెడ్ అధికారులు ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, మొదటి విడత నిర్మాణ పురోగతి సాధించాలని ఆదేశించారు.మొదటి విడతలో 9,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 683 ఇండ్లు పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని, బిల్లులు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు సూచించారు.

## ఎస్టిపిపి ముందు చత్రపతి శివాజీ విగ్రహం కావాలి



జైపూర్,**వాస్తవ గమ్యం జూలై 14 :** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టిపిపి)ఎదురుగా ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం కొరకు స్థలం కేటాయించాలని ఛత్రపతి శివాజీ సేన కమిటీ సభ్యులు మంగళవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు.ఛత్రపతి శివాజీ మహరాజ్ ని భారతీయులంతా ఆరాధ్య దైవంగా భావిస్తారని,సత్ప్రవర్తనకి,ధర్మ నిబద్ధతకి,ప్రచండమైన వీరత్వానికి,సుస్థిర రాజ్య పాలన కి మకుటం లా నిలిచిన అ మహాయోధుడి విగ్రహం జైపూర్ మండల కేంద్రం లో స్థాపించాలని కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సేన వ్యవస్థాపకులు మంతెన ఉదయ్ కిరణ్,ఇందారం గ్రామ ప్రధాన కార్యదర్శి కందుగుల పవన్ కుమార్,ఉపాధ్యక్షులు పెద్దపల్లి అజయ్,మొలుగు రమేష్,పెద్దపల్లి ప్రణబ్ పాల్గొన్నారు.అలాగే మంత్రి కిషన్ రెడ్డి స్పందించి తప్పకుండా మీ కోరిక నెరవేరుతుంది అని హామీ ఇవ్వడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు.

## పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామంలో పిల్లల్లో నులి పురుగుల సమస్యను నివారించి, వారి శారీరక, మానసిక ఎదుగుదలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు.నులి పురుగుల సమస్య సాధారణమైనదే అయినా నిర్లక్ష్యం చేస్తే రక్తహీనత, పోషకాహార లోపం, బరువు తగ్గడం, శారీరక ఎదుగుదల మందగించడం, మానసిక వికాసంపై ప్రతికూల ప్రభావం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆల్బెండజోల్ మాత్రలు శాస్త్రీయంగా పరీక్షించబడిన సురక్షితమైన ఔషధాలని, వైద్యుల సూచనల మేరకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. అపోహలు, భయాందోళనలకు గురికాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని కోరారు.అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా సిబ్బంది, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది గ్రామాల వారీగా పిల్లలను గుర్తించి మాత్రలు పంపిణీ చేస్తున్నారు. పాఠశాలకు హాజరుకాని పిల్లలను ఇంటింటికి వెళ్లి గుర్తించి మాత్రలు అందిస్తున్నారు. భోజనానికి ముందు చేతులు కడుక్కోవడం, మరుగుదొడ్లు వాడటం, గోర్లు శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రమైన తాగునీరు వినియోగించడం వంటి అలవాట్లతో నులి పురుగుల సమస్యను మరింత సమర్థవంతంగా నివారించవచ్చు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రజల సహకారంతో లక్ష్యాన్ని సాధించవచ్చని, ప్రతి అర్హత కలిగిన బాలబాలిక ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకుని ఆరోగ్యవంతమైన జీవితానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.

## వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

### కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగుపై ఆధారపడకుండా తక్కువ నీటి అవశ్యకత గల ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు.జిల్లాలో చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండకపోవడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో వరి పంట విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు ఎంపిక చేసుకోవాలని, బోరుబావుల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు కూడా వరి సాగు విస్తీర్ణం తగ్గించి మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, కంది వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేయడం ద్వారా నష్టాలను నివారించవచ్చని తెలిపారు.జూలై 31 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే, ఆగస్టు మొదటి వారంలో కందులు, ఉలవలు, అలసందలు, ఆముదం, నువ్వులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల విత్తనాలు విత్తుకోవడం రైతులకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. 2025 వానాకాలం సాగు వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 47,576 ఎకరాలలో వరి సాగు జరగగా, అందులో 22,876 ఎకరాలు బోరుబావుల ఆధారంగా, 24,700 ఎకరాలు చెరువులు, కుంటలు, వర్షాధారంపై సాగైనట్లు వివరించారు. ఈసారి చెరువులు, వర్షాధారంపై ఆధారపడే రైతులు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు విధానాలపై సమీప మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి లబ్ధి పొందాలని కోరారు.

# కౌటాల మండలంలో బిఆర్ఎస్‌లో చేరికలు

### కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు నాయకులు



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండలంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ పార్టీలో చేరారు.చేరిన వారిలో గురుడపేటకు చెందిన బీజేపీ నేత మేకల తిరుపతి, గురుడపేట కోయగూడాకు చెందిన బీజేపీ నేత తలండి హనుమంతు, గురుడపేటకు చెందిన బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ రాంచందర్, శీర్ష గ్రామ సర్పంచ్ అభ్యర్థి భీమయ్య, తుమ్మిడి హెట్టి నగపురేకు చెందిన బీజేపీ నేత బండు, మాజీ సర్పంచ్ కనికి ఎడ్ల వెంకటేష్ (కాంగ్రెస్), గిరవెల్లికి చెందిన బీజేపీ నేత ఎల్ములే మల్లేష్ తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. వీరితో పాటు తాటిపల్లికి చెందిన 6గురు వార్డు సభ్యులు, 5గురు కార్యకర్తలు కూడా చేరారు.పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు కోనేరు కోనప్ప నాయకత్వంలో సిర్పూర్ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కలిసి పనిచేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** సిర్పూర్ నియోజకవర్గం కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులు, రైతులను ఉద్దేశించి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పిలుపు మేరకు కాగజ్‌నగర్ టౌన్ బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ముఖ్యమంత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జూలై 11, 2026న హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసిఆర్హెచ్‌ఆర్డి)లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు ప్రతిపక్ష నాయకులు, రైతుల మనోభావాలను దెబ్బతీశాయని ఫిర్యాదులో ఆరోపించారు.ముఖ్యమంత్రి వ్యాఖ్యలు హింసను, ఆత్మహత్యలను ప్రేరేపించే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ, భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 2023లోని సెక్షన్లు 351, 61, 108, 192, 196 కింద కేసు నమోదు చేసి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ద్వేషపూరిత ప్రసంగాలపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబ సభ్యులు, తెలంగాణ రైతుల భద్రత దృష్ట్యా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కూడా కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోలేం వెంకటేష్, కౌన్సిలర్ పోచం, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్, శోభన్, రేణుగుంట్ల శ్రీనివాస్, నరేందర్, నజీమ్, తన్నీరు పోచం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

### ఎస్పీ నితికా పంత్



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది.ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని, కేసుల విచారణలో జాప్యం చేయరాదని ఎస్పీ సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 100 కాల్స్‌కు వేగంగా స్పందించాలని అన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని పురోగతికి కృషి చేయాలని, కేసుల నమోదు, దర్యాప్తు, నేరస్థుల వివరాల నిర్వహణలో సీసీటీఎన్ఎస్‌ను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. గంజాయి, మట్కా, జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు తమ నివాస, వ్యాపార ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రాపర్టీ కేసుల్లో సాంకేతికత వినియోగించి నేరస్తులను పట్టుకుని సొత్తు రికవరీ చేసి బాధితులకు అందించాలని, సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని, ప్రతి స్టేషన్ పరిధిలో నాకాబంది, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని ఆదేశించారు. మద్యం సేవించి, ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై వాహన తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహీదుద్దీన్, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంజేపీ హాస్టల్‌లో విద్యార్థుల ఆందోళన

### వీడియో కాల్‌లో మాట్లాడిన ప్రవీణ్ కుమార్



ఆసిఫాబాద్ **వాస్తవ గమ్యం జూలై 14 :** కాగజ్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) హాస్టల్‌లో పీఈటీ తమను వీపుపై అచ్చులు కనిపించేలా తీవ్రంగా కొట్టారని ఆరోపిస్తూ విద్యార్థులు హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విద్యార్థులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. తమకు జరిగిన ఘటనను విద్యార్థులు ఆయనకు వివరించారు. సమస్యలను పూర్తిగా విన్న ప్రవీణ్ కుమార్, విద్యార్థులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. విద్యార్థులపై ఎలాంటి శారీరక, మానసిక వేధింపులు జరిగినా సహించరాదని, ఘటనపై నిష్పాక్షిక విచారణ నిర్వహించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమైతే సంబంధిత పీఈటీపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.సంబంధిత పీఈటీని వెంటనే సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

## గ్రామాల్లో వైద్య శిబిరం, రాపిడ్ ఫీవర్ సర్వే...



తిర్యాణి, **వాస్తవ గమ్యం జూలై 14 :** తిర్యాణి :మంగళవారం రోజున కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా, తిర్యాణి మండలంలోని పెర్కపల్లి నాయకాపూగడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు అసంక్రమ వ్యాధుల స్క్రీనింగ్, రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించడం జరిగిందని డాక్టర్ పల్లవి తెలిపారు. ముందస్తుగా చర్యలో భాగంగా వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీఎస్ గంభీరావుపేట పాఠశాలను సందర్శించి విద్యార్థులకు డ్రై డే కార్యక్రమాలు, రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ పల్లవి, డీడీఓ, శ్రీనివాస్ (ఎస్‌యూఓ), రత్నమాల సూపర్వైజర్, మనెమ్మ ఏఎన్ఎమ్, ఆర్‌బీఎస్‌కే బృందం మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నరు..

# మంగిగుండాలలో ప్రత్యేక వైద్య చర్యలు

### మలేరియా, డెంగ్యూ నివారణపై అవగాహన



తిర్యాణి, **వాస్తవ గమ్యం జూలై 14 :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాలైన మంగి, గుండాల ప్రాంతాల్లో వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు పీఎం జనమన్‌ఎంఎం యూ 8 ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య కార్యక్రమం నిర్వహించారు. రోంపల్లి డీడీఓ వైద్యాధికారి డా. పల్లవి మరియు రోంపల్లి మెడికల్ ఆఫీసర్ డా. యశ్వంత్ ఆదేశాల మేరకు వైద్య బృందం మంగి, గుండాల ఉప ఆరోగ్య కేంద్రాలు మరియు పాఠశాలలను సందర్శించి ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, రక్తహీనత (అనీమియా) గుర్తింపునకు హీమోగ్లోబిన్ పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించారు. అలాగే సాధారణ వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించి పాఠశాల ఏఎన్ఎంకు అవసరమైన సూచనలు అందించారు. తదుపరి మంగి, గుండాల అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తీవ్ర మరియు మధ్యస్థ పోషకాహార లోపం (సామ్/మామ్) ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే గుండాల ఉప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన వైద్య బృందం సంబంధిత రికార్డులను తనిఖీ చేసింది. రాబోయే వర్షాకాలంలో వ్యాధుల నివారణ చర్యలు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పర్యవేక్షణ, ప్రత్యేక నివారణ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీడీఓ డా. పల్లవి, మెడికల్ ఆఫీసర్ డా. యశ్వంత్, పీఎం జనమన్ స్టాఫ్ నర్స్ రమాదేవి, పారామెడికల్ అసిస్టెంట్ శ్రావణి, పాఠశాల సీఆర్‌టీఈ మర్సకోలా అశోక్, ఆశా కార్యకర్తలు కె. ప్రమీల, పి. కాంతాబాయి, ఎ. లచ్చుబాయి, కె. పార్వతి, పి. చంద్రకళతో పాటు మంగి, గుండాల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ అమలు చేయాలి...

**బూర్గంపహాడ్ ఎంఈఓకు టీయూడబ్ల్యుజే (ఐజేయూ) వినతిపత్రం...**




భద్రాద్రి కొత్తగూడెం// : అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించే ప్రభుత్వ ఆదేశాలను మండలంలో కచ్చితంగా అమలు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) ప్రతినిధులు బూర్గంపహాడ్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) యదుసింహరాజును కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రత్నం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి శ్రీహరిబాబు, దొంకన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు జర్నలిస్టులు ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి మాట్లాడుతూ, అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ కూడా ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయినప్పటికీ మండలంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఈ ఉత్తర్వులు అమలుకావడం లేదని, సంబంధిత యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఈఓ యదుసింహరాజు స్పందిస్తూ, త్వరలో మండలంలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆదేశాల అమలుపై చర్చిస్తామని తెలిపారు. అర్హత కలిగిన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సభ్యులు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు శివకుమార్, ఈసీ సభ్యుడు రవి, సభ్యులు శ్రీనివాస్, రాంబాబు, కోట రమేష్, జక్కిరెడ్డి మల్లారెడ్డి, చేతుల శ్రీనివాస్, సుధాకర్, ముజాఫర్, కేసుపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా మున్నూరు కాపు సంఘం...

**బాధిత కుటుంబానికి రూ.42 వేల ఆర్థిక సాయం...**



పెద్దపల్లి// : ఆపదలో ఉన్న కుల బాంధవులను ఆదుకోవడమే మున్నూరు కాపు సంఘం ప్రధాన లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వైద లక్ష్మణ్ కుటుంబానికి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూ.42 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జడల సురేందర్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. గతంలో అందుగులపల్లెలో ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి చేసిన సహాయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో జిల్లాలోని ఏ మండలంలోనైనా కుల సోదరులు ఆపదలో ఉంటే స్థానిక సంఘాలతో కలిసి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రతి మున్నూరు కాపు కుటుంబం ఐక్యతతో ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజయ్య మాట్లాడుతూ, వైద లక్ష్మణ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సుభాష్‌నగర్‌కు చెందిన మిత్రులు, కుల బాంధవులు ఒక్క రోజులోనే రూ.42 వేల విరాళాన్ని సమీకరించడం అభినందనీయమని కొనియాడారు. స్థానిక నాయకత్వం ముందడుగు వేస్తే జిల్లా సంఘం తరఫున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులతో పాటు పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నుగిళ్ల మల్లయ్య, రాష్ట్ర నాయకులు అమీరిశెట్టి రామస్వామి, ఉనుకొండ శ్రీధర్, జిల్లా నాయకులు పూదరి శ్రీనివాస్, ఉప్పు రాజ్‌కుమార్, అమ్మిరిశెట్టి పూర్ణచందర్, స్వామి వివేక్ పటేల్, కొమిరిశెట్టి కనకయ్య, గండు రంగయ్య, ఉనుకొండ వైకుంఠం, సొల్లూరి రాజిరెడ్డి, వెన్నం రవీందర్, ఉనుకొండ రాజు, ఉనుకొండ భూమయ్య, దేవానంది శ్రీనివాస్, ఉప్పు రమేష్, కల్వల శ్రీనివాస్, తూముల రాజేశం, తూముల రవితేజ పటేల్, గండు రామ్మూర్తితో పాటు సుభాష్‌నగర్ మిత్రులు, మున్నూరు కాపు సంఘం సభ్యులు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ హద్దులకు శాశ్వత పరిష్కారం దిశగా రీ-సర్వే...

**ప్రజలు, రైతుల సహకారంతోనే కార్యక్రమం విజయవంతం...**

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష...**



పెద్దపల్లి// : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ రీ-సర్వే కార్యక్రమానికి ప్రజలు, రైతులు పూర్తి సహకారం అందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. భూముల హద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, భూ రికార్డులను ఆధునికీకరించడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలి విడతలో ధర్మారం మండలం పైడిచింతలపల్లి, పెద్దపల్లి మండలం నిమ్మన్‌పల్లి, సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి, రామగిరి మండలం పన్నూర్, మంథని మండలం మల్లాపల్లి గ్రామాల్లో భూ రీ-సర్వే కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమై కొనసాగుతోందన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం గ్రామకంఠం సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండో విడతలో భాగంగా జూలై 15 నుంచి అంతర్గాం మండలం సోమనపల్లి, ఎలిగేడు మండలం లోకపేట, పెద్దపల్లి మండలం రంగంపల్లి, పాలకుర్తి మండలం గూడిపల్లి, శ్రీరాంపూర్ మండలం మంగపేట, ఓదెల మండలం గూడెం, మంథని మండలం అంగులూరు, ముత్తారం (మంథని) మండలం శుక్రవారంపేట గ్రామాల్లో భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో కార్యక్రమం ప్రారంభానికి ముందుగా జూలై 14న గ్రామసభలు నిర్వహించి ప్రజలకు రీ-సర్వేపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సర్వే ప్రారంభానికి ముందు తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించి, భూ యజమానులకు రీ-సర్వే ఉద్దేశ్యం, అమలు విధానం, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించిన తర్వాతే సర్వే పనులు చేపడుతున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే అండ్ బౌండరీస్ చట్టం--1923 నిబంధనలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. భూ రీ-సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు శాస్త్రీయంగా నిర్ధారించబడటంతో పాటు భూ రికార్డులు నవీకరించబడతాయని, భూ యాజమాన్యానికి సంబంధించిన అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న వివాదాలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్కు, ఇతర అవసరమైన భూ పత్రాలను సిద్ధంగా ఉంచుకుని అధికారులు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. సర్వే పనుల్లో రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు గ్రామస్థులు, రైతులు సహకరించాలని, గ్రామసభలకు తప్పనిసరిగా హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రజల సహకారంతో భూ రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి జిల్లాలో భూ పరిపాలనను మరింత పారదర్శకంగా, ఆధునికంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

## రెండో అంతస్తు నుంచి దూకిన ఇంటర్ విద్యార్థిని...

**మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు...**

**కస్తూర్బా కళాశాలలో విషాద ఘటన...**




నారాయణపేట// : నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కళాశాలలో చదువుతున్న ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని కళాశాల భవనం రెండో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. సమాచారం మేరకు, ఉదయం కళాశాల ఆవరణలో ఉన్న సమయంలో విద్యార్థిని ఒక్కసారిగా భవనం రెండో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకింది. ఈ ఘటనను గమనించిన తోటి విద్యార్థినులు వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వెంటనే కళాశాల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన విద్యార్థినికి ప్రాథమిక చికిత్స అందించి, అత్యవసరంగా అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఘటన సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు కళాశాలకు చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థిని ఈ తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకుందనే విషయంపై విచారణ చేపట్టారు. వ్యక్తిగత కారణాలా, విద్యా ఒత్తిడా, లేక మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నుంచి పూర్తి వివరాలు రావాల్సి ఉంది. ఈ ఘటనతో కళాశాల ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తోటి విద్యార్థినులు భయాందోళనకు గురికాగా, తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు గల అసలు కారణాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# బొగ్గు గనిలో 'కుర్చీలాట'!

**సింగరేణి అధికారుల అపవిత్ర బంధాలు..**

**బయటపెడుతున్న 'వాస్తవ గమ్యం' ప్రత్యేక కథనం!**




సింగరేణిలో అధికారుల 'పాతుకుపోవడం'!

మంచిర్యాల, **వాస్తవ గమ్యం జూలై 14 :** సింగరేణి... నల్లబంగారపు సామ్రాజ్యం. వేల అడుగుల లోతున, ప్రాణాలను పణంగా పెట్టి కార్మికులు రక్తాన్ని చెమటగా మార్చితేనే ఈ ప్రభుత్వ రంగ సంస్థ లాభాల బాట పడుతుంది. కానీ, ఆ శ్రమను దోచుకుంటూ, వ్యవస్థను నీరుగారుస్తూ కొందరు అధికారులు చేస్తున్న 'కుర్చీలాట' ఇప్పుడు సింగరేణి మనుగడకే ముప్పుగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం... ఒక అధికారి ఒకే ఏరియాలో లేదా విభాగంలో గరిష్టంగా 3 నుండి 5 ఏళ్లకు మించి పనిచేయకూడదు. ఆ తర్వాత వారిని వేరే ప్రాంతానికి బదిలీ (రొటేషనల్ ట్రాన్స్ఫర్) చేయడం చట్టబద్ధమైన ప్రక్రియ. కానీ, మన సింగరేణిలోని కొన్ని కీలక ఏరియాల్లో మాత్రం ఈ నిబంధనలు గాల్లో కలిసిపోతున్నాయి. రాజకీయ అండదండలు, అంతర్గత పట్టుతో కొందరు అధికారులు ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట వేస్తున్నారు. కుర్చీకి ఫెవికాల్ వేసుకున్నట్లు పాతుకుపోయిన ఈ 'శాశ్వత' అధికారుల వల్ల సంస్థకు, ముఖ్యంగా కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై 'వాస్తవ గమ్యం' ప్రత్యేక విశ్లేషణ.

### 'వ్యక్తిగత సామ్రాజ్యాలు'.. హక్కుల కాలరాశిత!

ఒక అధికారి ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి ఉండిపోతే, అక్కడ అధికారిక పారదర్శకత లోపించి ఒక 'వ్యక్తిగత సామ్రాజ్యం' తయారవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల సామాన్య కార్మికుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సుదీర్ఘ కాలం ఒకే చోట ఉండటం వల్ల సదరు అధికారికి కొందరితో 'అతి చనువు', మరికొందరితో 'విభేదాలు' ఏర్పడుతున్నాయి. ఫలితంగా.. నిబద్ధతతో పనిచేసే కార్మికులకు రావాల్సిన పదోన్నతులు, బదిలీలు, క్వార్టర్ల కేటాయింపు, చివరికి అనారోగ్యంతో బాధపడేవారికి ఇచ్చే 'మెడికల్ అన్‌ఫిట్' కేటాయింపుల్లో కూడా తీవ్రమైన పక్షపాత ధోరణి కనిపిస్తోందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. కొత్తగా వచ్చే అధికారి అయితే బాధ్యతగా ఉంటాడు, క్షేత్రస్థాయి సమస్యలను చురుగ్గా వింటాడు. కానీ, పాత అధికారికి అన్నీ 'మామూలే' అనే బద్ధకం, అలసత్వం వచ్చేస్తాయి. ఫలితంగా అండర్‌గ్రౌండ్ గనుల్లో రక్షణ పరికరాల సరఫరా, పని వాతావరణం మెరుగుపరచడం వంటి ప్రాథమిక అవసరాలను కూడా ఉదాసీనంగా తీసుకునే ప్రమాదం ఉంది. ఇది అల్టిమేట్‌గా కార్మికుల ప్రాణాలకే ముప్పుగా మారుతోంది.

### అపవిత్ర బంధాలు - గొంతు నొక్కుడు!

ఒకే చోట తిష్ట వేయడం వల్ల కొన్ని కార్మిక సంఘాల స్థానిక నాయకులతో సదరు అధికారికి 'అపవిత్ర బంధం' ఏర్పడుతోందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కొంతమంది నేతలకు లబ్ధి చేకూరుస్తూ, హక్కుల కోసం ప్రశ్నించే సామాన్య కార్మికుడి గొంతు నొక్కేసే దారుణమైన పరిస్థితులు దాపురిస్తున్నాయని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలుతోంది.

### అవినీతికి రాజమార్గం.. అభివృద్ధికి బ్రేకులు!

సింగరేణి లాంటి మహారత్న స్థాయికి ఎదుగుతున్న ప్రభుత్వ రంగానికి ఈ 'పాతుకుపోవడం' అనే రోగం కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ఒకే చోట ఎక్కువ కాలం ఉంటే స్థానిక కాంట్రాక్టర్లు, స్క్రాప్ మాఫియా, ఇతర అక్రమార్కులతో ఆ అధికారికి బలమైన లింకులు ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల టెండర్ల కేటాయింపు, బొగ్గు నాణ్యత పరిశీలన, కొనుగోళ్లలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### కొత్తదనం లేని పాత చింతకాయ పచ్చడి:

వేరే ప్రాంతం నుండి వచ్చే అధికారి కొత్త ఆలోచనలతో, ఉత్పాదకతను పెంచే సరికొత్త వ్యూహాలతో వస్తారు. కానీ ఒకే చోట ఉండిపోయిన అధికారి పాత పద్ధతులకే పరిమితమవ్వడం వల్ల కంపెనీ ఆధునీకరణకు అడ్డుకట్ట పడుతోంది.

### బాధ్యత మరిచి.. స్వార్థ రాజకీయం!

నిజానికి ఒక అధికారి అనుభవం, మేధస్సు కంపెనీ వృద్ధికి ఇంధనం కావాలి. గనుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకుంటూనే, కార్మికుల ప్రాణాలకు గ్యారెంటీ ఇచ్చే రక్షణ చర్యలను పర్యవేక్షించాలి. క్షేత్రస్థాయి సమస్యలను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. కానీ ఇక్కడ జరుగుతోంది వేరు! కంపెనీ ప్రయోజనాల కోసం ఉపయోగపడాల్సిన అధికారి శ్రమ. అంతా కేవలం "తన సీటును ఎలా కాపాడుకోవాలి? తన వర్గానికి ఎలా లబ్ధి చేకూర్చాలి?" అనే స్వార్థపూరిత సమీకరణాలకే పరిమితమవుతోందనే విమర్శలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, వనరులను కంపెనీ ఎదుగుదలకు కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

### విజిలెన్స్ విచారణ జరగాల్సిందే!

సింగరేణి మనుగడ సాగించాలన్నా, రక్తం చిందిస్తున్న కార్మికులకు న్యాయం జరగాలన్నా ఒకే ఏరియాలో మూడేళ్లకు పైబడి ఉన్న అధికారులను తక్షణమే బదిలీ చేయాలి. గౌరవ సీఎండి లేదా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, ఇలాంటి 'పాతుకుపోయిన' అధికారుల కాలంలో జరిగిన టెండర్లు, కాంట్రాక్టులపై విజిలెన్స్ విభాగంతో సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే సింగరేణికి, దాన్ని నమ్ముకున్న లక్షలాది కార్మిక కుటుంబాలకు నిజమైన న్యాయం జరుగుతుంది.

# అడవిని తలపిస్తున్న కొలనూర్ రైల్వే స్టేషన్...!

**ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమా..?**

**ప్లాట్‌ఫాంపై గడ్డి, ముళ్లపొదల రాజ్యం...**

**పాములు, తేళ్ల సంచారంపై భయాందోళన...**

**లేచిపోయిన సిమెంట్ గచ్చు, నాసిరకం పనులపై అనుమానాలు...**

**చీకట్లోనే ప్రయాణికుల నిరీక్షణ...**

**మహిళలు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు...**

ఓదెల// : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట్ సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే మార్గంలో ఉన్న కొలనూర్ రైల్వే స్టేషన్ ప్రస్తుతం నిర్లక్ష్యానికి ప్రతీకగా మారింది. ప్రయాణికులకు భద్రత, పరిశుభ్రత, సౌకర్యాలు కల్పించాల్సిన ప్లాట్‌ఫాంలు గడ్డి, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో కప్పుకుపోయి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా మారి, ప్లాట్‌ఫాంపై నడవడానికే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఏర్పడింది. కొద్ది సంవత్సరాల క్రితం ఆధునీకరణలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ, వాటిలో నాణ్యత లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాట్‌ఫాంపై వేసిన సిమెంట్ గచ్చు అనేక చోట్ల లేచిపోవడం, పగుళ్లు ఏర్పడడం, వాటి మధ్య గడ్డి మొలవడం పనుల నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు ఇంత త్వరగా దెబ్బతినడం వెనుక కారణాలపై రైల్వే అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### ప్రయాణికుల భద్రతే ప్రశ్నార్థకం...

కొలనూర్ రైల్వే స్టేషన్‌ను ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు వందల సంఖ్యలో వినియోగిస్తున్నారు. అలాంటి కీలక స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై పెరిగిన గడ్డి కారణంగా పాములు, తేళ్లు సంచరిస్తుండటం ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.

### వెలుతురు లేక చీకట్లోనే నిరీక్షణ...

ప్లాట్‌ఫాంపై తగినంత లైటింగ్ లేక పోవడంతో రాత్రి సమయంలో రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులు చీకట్లోనే గంటల తరబడి గడపాల్సి వస్తోంది. మహిళలు, చిన్నారులతో ప్రయాణించే కుటుంబాలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చీకటి కారణంగా ప్లాట్‌ఫాంపై ఉన్న గుంతలు, పగుళ్లు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.






### పరిశుభ్రతకు దూరమైన కొలనూర్ స్టేషన్...

పరిశుభ్రతకు మారుపేరుగా ఉండాల్సిన కొలనూర్ రైల్వే స్టేషన్ పరిసరాలు ప్రస్తుతం చెత్తా చెదారం, గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ప్లాట్‌ఫాంను ఊడ్చిన చెత్తను కూడా అక్కడే వదిలేయడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తికి కూడా అవకాశం ఏర్పడుతోందని వారు పేర్కొంటున్నారు.



### కొలనూర్ స్టేషన్ ప్రాధాన్యత ఏమిటి...?

కొలనూర్ రైల్వే స్టేషన్ ఓదెల మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. విద్యార్థులు విద్యాసంస్థలకు, ఉద్యోగులు తమ కార్యాలయాలకు, రైతులు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, చిన్న వ్యాపారులు వ్యాపార అవసరాలకు ఈ స్టేషన్‌పైనే ఎక్కువగా ఆధార పడుతున్నారు. కాజీపేట్--సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే మార్గంలో ఉన్న ఈ స్టేషన్ స్థానిక ప్రజల దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇలాంటి ముఖ్యమైన స్టేషన్‌ను నిర్లక్ష్యం చేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### విధి నిర్వహణలో నిర్లక్ష్యమా..?

అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయడం మాత్రమే కాకుండా, వాటిని నిరంతరం నిర్వహించడం కూడా రైల్వే శాఖ బాధ్యత. కానీ కొలనూర్ స్టేషన్‌లో మాత్రం నిర్వహణ పూర్తిగా గాలికొదిలేసినట్లు కనిపిస్తోంది. గడ్డి తొలగించడం, ప్లాట్‌ఫాంను శుభ్రపరచడం, పగుళ్లను పూడ్చడం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం వంటి కనీస చర్యలు కూడా చేపట్టక పోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజల డిమాండ్ ఇదే...

కొలనూర్ రైల్వే స్టేషన్‌ను వెంటనే పరిశీలించి ప్లాట్‌ఫాంపై పెరిగిన గడ్డి, ముళ్లపొదలను పూర్తిగా తొలగించాలని, లేచిపోయిన సిమెంట్ గచ్చును నాణ్యతతో పునర్నిర్మించాలని, రాత్రి వేళల్లో సరిపడా హైమాస్ట్ లేదా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రతను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు, నిత్య ప్రయాణికులు రైల్వే శాఖను కోరుతున్నారు. ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాల్సిన రైల్వే స్టేషన్, నిర్లక్ష్యానికి చిరునామాగా మారడం బాధాకరం. అధికారులు స్పందించి కొలనూర్ స్టేషన్‌కు మళ్లీ పూర్వ వైభవం

# పోతేపల్లిలో 'కనిపించని' సీసీ రోడ్డు.. డిజిటల్ మాయాజాలం చేసిన అధికారులు!

ఆసిఫాబాద్. **వాస్తవ గమ్యం జూలై 14 :** అధికారుల అత్యుత్సాహమో, లేక కాంట్రాక్టర్ల మాయాజాలమో కానీ.. క్షేత్రస్థాయిలో ఇంకా పనులే మొదలుకాకముందే, ఆన్‌లైన్ రికార్డుల్లో మాత్రం పనులు వంద శాతం పూర్తయిపోయాయి! అవును. మీరు చదువుతున్నది నిజమే. కంటికి కనిపించని ఈ 'మాయా రోడ్డు' వ్యవహారం ఇప్పుడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మండలంలోని పోతేపల్లి గ్రామంలో ప్రతిపాదించిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో జరిగిన ఈ భారీ అవకతవకలు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయి.

### అసలేం జరిగింది?

జూన్ 30: ప్రభుత్వ అధికారిక ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం పోతేపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం విజయవంతంగా 'పూర్తయింది. జూలై 8: స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా ఇదే రోడ్డు పనులకు అత్యంత వైభవంగా శంకుస్థాపన/ప్రారంభోత్సవం జరిగింది. జూన్ 30 నాటికే పనులు పూర్తయితే.. జూలై 8న ప్రజాప్రతినిధులు ప్రారంభించిన పనులు దేనికి? కాగితాల్లో పూర్తయిన రోడ్డుపై మళ్లీ కొబ్బరికాయ కొట్టడం వెనుక ఉన్న మతలబు ఏంటి?

### అధికారుల 'డిజిటల్' హస్తలాఘవం!


సాధారణంగా పనులు పూర్తయ్యాక ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ఎంబీ రికార్డు నమోదు చేసిన తర్వాతే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ ఇక్కడ మాత్రం పనులు ప్రారంభం కాకముందే. జూన్ 30 నాటికే పనులు పూర్తయినట్లు రికార్డు సృష్టించేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ, టెక్నాలజీని అడ్డం పెట్టుకొని తప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వెనుక ఏ స్థాయి అధికారుల హస్తం ఉందనేది ఇప్పుడు మిస్టరీగా మారింది.


### మండిపడుతున్న ప్రజలు.. ఉన్నతాధికారుల స్పందన ఏది?

ప్రభుత్వ నిధులతో ప్రజా బాహుళ్యం కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో ఇంతటి పారదర్శకత లోపించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ రికార్డులు, ప్రత్యక్ష ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నా.. ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై కేవలం విచారణ మాత్రమే కాకుండా, ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసిన








బాధ్యులైన అధికారులపై, సదరు కాంట్రాక్టర్‌పై తక్షణమే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్న ఇలాంటి 'మాయా'గాళ్ల గుట్టు రట్టు కావాల్సిందేనని ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# పారాలు సమర్పించ కుంటే ఓటు కోల్పోయే అవకాశం

సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్



యాచారం నేటి ప్రభాత సూర్య:. ప్రత్యేకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ భాగంగా ఓటరు పారాలను బిఎల్ఓ లకు అందజేయాలని తాడి పర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్లతో తమ ఓటు హక్కును ఒకే చోట పొందేలా చూసుకోవాలని బిఎల్వోలు చెప్పారు. డబ్బులు ఓట్లు, మరణించిన ఊట తొలగింపు అని ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఓట్లు ఘనన పత్రాలు సకాలంలో నింపి బిఎల్ఓ లకు అందజేయాలని సూచించారు. వాటి వివరాలు ఆన్లైన్లో పొందుపరిచే దిశగా కొనసాగుతుందన్నారు. తొందరగా పారాలు సమర్పించకుంటే ఓటు కోల్పోయే అవకాశం ఉందని గ్రామ ఓటర్లకి తెలియజేశారు.

## గాయం ఉపేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ





**మిర్యాలగూడ :** పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా తలకొప్పుల సైదులు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించే నాయకుడు గాయం ఉపేందర్ రెడ్డి అని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా నిర్వహిస్తూ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచికట్ల లింగయ్య యాదవ్, సీనియర్ నాయకులు గజ్జ నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ, ఎడ్ల సురేష్, గోపి, దైద సురేష్, సతీష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న ఫ్లీజ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్



పెండింగులో ఉన్నటువంటి ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా మాల మహానాడు విద్యార్థి విభాగం, జాతీయ ప్రధాన కార్యదర్శి, తాళ్లపల్లి సురేష్, మాట్లాడుతూ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి పెండింగ్ లో ఉన్నటువంటి బకాయిలను ఇంతవరకు చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ తన దగ్గర పెట్టుకొని విద్యార్థులను యజమాన్యాలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు అన్నారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున, ముట్టడి కార్యక్రమాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని వారు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షులు, లావూరి రవీందర్ నాయక్, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు, వజ్రగిరి అంజయ్య, మాల మహానాడు యువజన నాయకులు, కామల్ల మధు, నాగు, గోపి, రవి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పెండింగ్‌లో ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్ని విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు నిరంతరం ఉద్యమాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.వేలాది మంది విద్యార్థులు ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత విద్య కొనసాగించడంలో అనేక ఆటంకాలు ఏర్పడుతు న్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా స్పందించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఆలస్యం చేయకుండా ఫీజు బకాయిల విడుదలపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

# సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలి: ఐఎన్‌టీయూసీ నాయకులు!



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 14 :** సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. శ్రీరాంపూర్ అతిథి గృహంలో సోమవారం మంత్రిని కలిసిన ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్‌తో పాటు ఇతర నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల సింగరేణికి తాడిచెర్ల--2 బొగ్గు గనిని కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ హోదా లభిస్తే భూసేకరణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు చట్టపరమైన, పర్యావరణ అనుమతులు త్వరగా లభించే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే కొత్త గనుల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఏర్పడి, దేశ ఇంధన భద్రత బలోపేతం కావడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సింగరేణి మరింత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, ఉపాధ్యక్షులు శ్యామ్, దాస్, సదానందం, ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్, గనుల సిబ్బంది విభాగం బాధ్యులు తిరుపతి రాజు, ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి: బల్దియా కమిషనర్ టి. వెంకన్న

క్షేత్రస్థాయిలో ఎస్‌టిపి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల పరిశీలన

గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం





**వరంగల్ జిల్లా ఇంచార్జ్ జూలై 14 :** నగరంలో సాగుతున్న వివిధ ప్రతిష్టాత్మక అభివృద్ధి పనుల ను మరింత వేగవంతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో నూ నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడకూడదని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (STP), ఇంటిగ్రేటెడ్ వెజ్ - నాన్ వెజ్ మార్కెట్ల (IVNM) నిర్మాణ ప్రగతిని ఆయన నిశితంగా తనిఖీ చేశారు.

**క్షేత్రస్థాయి పరిశీలన ముఖ్యాంశాలు:**

**ఎస్‌టిపి పనుల తనిఖీ:**

హనుమకొండ పరిధిలోని ప్రగతినగర్‌లో నిర్మాణంలో ఉన్న 15 ఎం.ఎల్.డి సామర్థ్యం గల ఎస్‌టిపి ప్లాంట్ పనులను కమిషనర్ పరిశీలించారు. అలాగే, ఉర్సుగుట్ట ప్రాంతంలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 5 ఎం.ఎల్.డి సామర్థ్యం గల ఎస్‌టిపి ప్లాంట్ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.

**ప్రతిపాదిత స్థలాల పరిశీలన:**

66వ డివిజన్ దేవన్నపేటతో పాటు, హనుమకొండ పరిధిలోని రెడ్డిపురంలో నిర్మించ తలపెట్టినప్రతిపాదిత ఎస్‌టిపి నిర్మాణ స్థలాలను కమిషనర్ సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.

**ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల ప్రగతి:**

రామ్‌నగర్ మరియు వరంగల్ పరిధిలోని లక్ష్మీపురంలో అత్యాధునికంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ - నాన్ వెజ్ మార్కెట్ (×ఎచీవీ) పనులను పరిశీలించి, నిర్మాణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే వేగవంతం చేయాలని సూచించారు.

**అధికారులకు కమిషనర్ కీలక ఆదేశాలు:**

"నిర్ణీత గడువులోగాపనులన్నీ పూర్తి కావాలి. ఎస్‌టిపిల నిర్వహణను అత్యంత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, మార్కెట్ల నిర్మాణంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను తూచా తప్పకుండా పాటించాలి." ఈ క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ వెంట బల్దియా ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, డీఈలు రాజ్‌కుమార్, సారంగంతో పాటు ఇతర మున్సిపల్ అధికారులు మరియు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం, త్రాగునీటి పంపిణీ


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ :** మిర్యాలగూడ బస్టాండ్‌లో వాసవి క్లబ్ మిర్యాలగూడ వారి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన ఉచిత అల్పాహారం, త్రాగునీటి పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రయాణికులకు స్వయంగా అల్పాహారం పంపిణీ చేసి,వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు మండుటెండలు, ప్రయాణాల మధ్య ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమని, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు వాసవి క్లబ్ సభ్యులు నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు అండగా నిలవడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవకులు, క్లబ్ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు...

## జిల్లా విద్యుత్ శాఖ ఎస్.ఈ గా బాధ్యతలు స్వీకరించిన అమరబోయిన శ్రీనివాస్

మర్యాదపూర్వకంగా కలిసిన మిర్యలగూడ బీసీ జేఏసీ నేతలు



**మిర్యాలగూడ :** నల్గొండ విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా అమరబోయిన శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ బిసి సంఘ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.విద్యుత్ బిసి రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్.ఈ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎస్.ఈ అమరబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగులు సిబ్బంది రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని అన్నారు. ప్రజలకు, పశువులకు మరియు విద్యుత్ శాఖ కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ బిసి సంఘ అధ్యక్షుడు, గంజి వెంకన్న, కార్యదర్శి ఊటుకూరి గిరి, లైజాన్ ఆఫీసర్ మధు, ఏ.ఏ.ఓ, కె బిక్షపతి,. జే.ఏ.వో, వి రవికుమార్, ఏ.డి.ఈ శంకరయ్య,. జే.ఏ.ఓ హరి ప్రసాద్, జి శ్రీనివాస్, ఏఈ, ఎస్ హరికృష్ణ, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు లేదని ఎన్యూమరేషన్ ఇవ్వలేదు

ఇల్లు సాకుతో ఫామ్స్ ఇవ్వకపోతే కొత్తూరులో సగానికి పైన ఓట్లు గల్లంతవుతాయి

బిఆర్ఎస్ నాయకులు శివ చారి



**కొత్తూరు, :** ఇల్లు లేదనే సాకుతో ఓటర్లకు ఎనుమరేషన్ పత్రాలను పంపిణీ చేసేందుకు బిఎల్వోలు నిరాకరించిన సంఘటన కొత్తూరు పురపాలక కేంద్రంలో వెలుగు చూసింది. పదవ వార్డులోని ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న అమర్నాథ్ రెడ్డి మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. పిల్లల చదువుల కోసం ఏడాది క్రితం షాద్ నగర్ మకాం మార్చాడు. కానీ, కొత్తూరులోనే తన ఓటు ఉండాలని నిర్ణయించుకున్నాడు. బిఎల్ఓను కలిసి తన పేరుతో వచ్చిన ఎన్యూమరేషన్ పత్రాన్ని ఇవ్వాలని కోరగా.. ఆమె స్థానికంగా ఇల్లు లేదని తిరస్కరించారు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ సోమ్లా నాయక్, భారాస నేత శివ చారి అధికారులను నిలదీశారు. దీంతో కొత్తూరు ఇన్చార్జి తహసిల్దార్ సైదులతో ఫోన్లో మాట్లాడారు. మొదట బిఎల్ఓ నిర్ణయాన్ని సమర్థించిన తహసిల్దార్ అనంతరం.. ఆర్డిఓతో చర్చించి తదుపరి నిర్ణయం వెల్లడిస్తానని పేర్కొన్నారూ. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొందరు నాయకుల కనుసన్నల్లో బిఎల్వోలు పనిచేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడైనా ఒక చోట మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండే హక్కు పౌరులకు ఉందని వారు వివరించారు. పత్రాలు ఇవ్వకుండా నిరాకరించే అధికారం బిఎల్వోలకు లేదని, ఇది భారత ఎన్నికల, ప్రజా ప్రాతినిధ్య చట్టంకు విరుద్ధమని వివరించారు. ఇలా ఇల్లు లేని వారి ఓట్లను తొలగించుకుంటూ పోతే కొత్తూరులో ఒక్క వార్డుకు సరిపడా ఓటర్లు కూడా మిగలరని ఎద్దేవ చేశారు.

## రాత్రిపూట ఈ లక్షణాలు కనిపిస్తే యమడేంజర్.. మీ కిడ్నీలను కాపాడుకోండి..





శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి.. ఇది శరీరం నుండి మలినాలను తొలగించడానికి పనిచేస్తుంది. కిడ్నీలు లేకుండా శరీరం పనిచేయడం కష్టం. కిడ్నీ వైఫల్యానికి ముందే, మన శరీరం సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. రాత్రి నిద్రపోతున్నప్పుడు కనిపించే ఈ లక్షణాలను విస్మరించకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ˊరీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు (కిడ్నీలు) ఒకటి.. కిడ్నీలు శరీరం నుంచి మలినాలను తొలగించడానికి పనిచేస్తాయి.. మూత్రపిండాలు లేకుండా, శరీరం పనిచేయడం కష్టం. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయి.. అందుకే మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం అవసరం. మూత్రపిండాల వైఫల్యానికి ముందే, మన శరీరం సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. అయితే.. కిడ్నీ వ్యాధులకు సంబంధించి రాత్రిపూట కొన్ని సంకేతాలు కనిపిస్తాయని.. వాటిని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మూత్రపిండాల దెబ్బతిన్నప్పుడు.. రాత్రి వేళ కనిపించే లక్షణాలేంటో తెలుసుకోండి..**

రాత్రిపూట తరచూ మూత్ర విసర్జన: మూత్ర విసర్జన శరీరం సాధారణ పని.. కానీ రాత్రిపూట అధికంగా మూత్ర విసర్జన చేయడం మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం. మూత్రపిండాలలో ఏదైనా సమస్య మొదట మూత్రం ఏర్పడటాన్ని ప్రభావితం చేస్తుంది. మీరు నిద్రలో కూడా మూత్ర విసర్జన చేస్తుంటే.. ఈ లక్షణాన్ని విస్మరించవద్దు. అధికంగా చెమటలు: వేసవిలో అందరికీ చెమటలు పడతాయి, కానీ రాత్రిపూట అధిక చెమటలు పట్టడం మూత్రపిండాల వైఫల్యానికి హెచ్చరిక సంకేతం కావచ్చు. దీనివల్ల శరీరంలో క్రియాటినిన్ స్థాయిలు పెరుగుతాయి.. తీవ్రమైన రక్తపోటు: అధిక రక్తపోటు మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం కావచ్చు. మూత్రపిండాలలో లోపం ఉన్నప్పుడు, అవి క్రియేటినిన్‌ను ఫిల్టర్ చేయలేవు, అటువంటి పరిస్థితిలో, క్రియేటినిన్ రక్త నాళాలలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది రక్త నాళాలను విస్తరిస్తుంది.. అంతేకాకుండా.. ఇది రక్త ప్రసరణను ప్రభావితం చేసి.. రక్తపోటును పెంచుతుంది. వాంతులు వికారం: వాంతులు కూడా మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం. రాత్రి భోజనం తర్వాత మీరు తరచుగా వాంతులు చేసుకుంటే లేదా వికారం అనిపిస్తే, అది మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం. అటువంటి లక్షణాలను విస్మరించడం ప్రమాదకరం. పాదాల నొప్పి: ఎటువంటి కారణం లేకుండా మీ పాదాలలో నొప్పి ఉంటే, అది సాధారణం కాదు. శరీరంలో క్రియాటినిన్ స్థాయి పెరిగినప్పుడు, పాదాల నొప్పి సమస్య తలెత్తుతుంది. ఎందుకంటే పాదాలలో క్రియాటినిన్ పెరిగిన మొత్తం పేరుకుపోతుంది. కావున ఈ లక్షణాలను అస్సలు విస్మరించవద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీకు ఏమైనా సమస్యలుంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందండి..

## వామ్మో ఈ పువ్వులో ఉన్న రహస్యం తెలిస్తే అస్సలు వదలరు..! ఇది నిజం



ఈ మసాలా చర్మాన్ని ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. ఈ మసాలా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. స్టార్ సోంపును సాంప్రదాయకంగా దగ్గు, జలుబు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. స్టార్ పువ్వు రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం వల్ల పుష్కల పోషకాలు ఉంటాయి. శరీరానికి మేలు చేస్తాయి. స్టార్ అనైజ్ డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.. ఈ భారతీయ మసాలా దినుసు ఆరోగ్య ప్రయోజనాలు మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇది వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. స్టార్ సోంపు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అపానవాయువు, మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. స్టార్ సోంపును సాంప్రదాయకంగా దగ్గు, జలుబు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. స్టార్ పువ్వు రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం వల్ల పుష్కల పోషకాలు ఉంటాయి. శరీరానికి మేలు చేస్తాయి. స్టార్ అనైజ్ డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.. స్టార్ సోంపులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఈ మసాలా బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. స్టార్ సోంపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్‌లను తొలగించడంలో సహాయపడతాయి. ఇందులో యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. అంటే ఇది ముఖ్యంగా జలుబు, రొంప సమస్యలకు మంచి ఔషధం అని చెప్పాలి. దీంతో సహజసిద్ధంగా ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తుంది. ఈ మసాలా చర్మాన్ని ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. ఈ మసాలా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ మసాలా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. స్టార్ అనైజ్ షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. రక్తంలో చక్కెర స్థాయిలను హఠాత్తుగా పెరగనివ్వకుండా కాపాడుతుంది. షుగర్ బాధితుల్లో మెటబాలిజం రేటు పెంచుతుంది. స్టార్ అనైజ్ షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది.

వాస్తవ గమ్యం
తెలుగు దినపత్రిక
బుధవారం-15 - జూలై - 2026

# రెడ్ డ్రెస్ లో అయేషా ఖాన్ స్టన్నింగ్ లుక్ !



ఇన్స్టాగ్రామ్ వేదికగా మరో ట్రెండీ ఔట్ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో రెడ్ డ్రెస్ ధరించి హాట్ ఎక్స్పోజులతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేసింది. రెడ్ డ్రెస్ లో అందాలు ఆరబోస్తూ సెగలు పుట్టిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. ఈ ఫోటోలకు క్యాప్షన్ గా "నాకు అండగా ఉండు" అంటూ జోడించింది. ఇకపోతే షేర్ చేసిన ఫోటోలకు, ఇచ్చిన క్యాప్షన్ కి అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తమ ఆలోచనలను అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఏది ఏమైనా ఇన్స్టాగ్రామ్ వేదికగా అయేషా ఖాన్ పంచుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అయేషా ఖాన్ విషయానికి వస్తే ముంబైలో జన్మించింది. ఈమె తండ్రి షహాబ్ ఖాన్ బీహార్ లోని పక్రిబరవాన్ లో జన్మించి, ముంబైలో స్థిరపడ్డారు. ఈమె సోదరుడు షహాబాజ్ ఖాన్ , ఇండియన్ మర్చంట్ నేవీలో అధికారిగా పనిచేస్తున్నారు. నిజానికి ఈమెకు లక్కీ భాస్కర్ సినిమాలో అవకాశం వచ్చినా.. షెడ్యూల్ సమస్యల కారణంగా ఈ చిత్రం నుండి తప్పుకుంది..ఇక సన్నీ డియోల్ నటించిన గోపీచంద్ మలినేని జాట్ చిత్రంలో పోలీస్ అధికారిగా చిన్న పాత్ర పోషించింది. ఇక అలాంటి ఈమె ఆదిత్యధర్ దర్శకత్వంలో ధురంధర్ సినిమాలో షరారత్ అనే పాటలో క్రిస్టల్ డిసౌజా తో కలిసి సందడి చేసింది. ఈ పాటతో విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఆ తర్వాత కపిల్ శర్మ కామెడీ చిత్రం కిస్ కిస్కో ప్యార్ కరూన్ 2



ఏక్తా కపూర్ 'కసౌతీ జిందగీ కే'తో జూనియర్ ఆర్టిస్ట్ గా టెలివిజన్ అరంగేట్రం చేసిన అందాల తార అయేషా ఖాన్ 2019లో టెలివిజన్ షో బాలవీర్ రిటర్న్స్ ద్వారా విలన్ పాత్రలో విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది. ఈ పాత్ర ద్వారా ఊహించని ఇమేజ్ అందుకున్న ఈ చిన్నది.. 2022లో ముఖచిత్రం అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత 2023లో వరల్డ్ బిగ్గెస్ట్ రియాలిటీ షో అయిన బిగ్ బాస్ హిందీ సీజన్ 17లో పోటీదారునిగా అడుగుపెట్టిన అయేషా ఖాన్.. హౌస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత 2014లో మరో రియాల్టీ షో అయిన ఖత్రోన్ కే ఖిలాడీలో కూడా పాల్గొనింది. ఇకపోతే ఈమె తెలుగు, హిందీలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఓం భీమ్ బుష్ సినిమాలో రత్తాలు పాత్రతో అదరగొట్టిన ఈమె.. గ్యాంగ్ ఆఫ్ గోదావరి చిత్రంలో మోత అనే పాటలో తన డాన్స్ పెర్ఫార్మన్స్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక మనమే చిత్రంతో మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించింది. అలా తెలుగులో పలు చిత్రాలు చేసి తెలుగు ఆడియన్స్ ఆకట్టుకున్న ఈ చిన్నది.. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే

# పింక్ లాంజ్ అవుట్‌ఫిట్‌లో సీరత్ కపూర్ రచ్చ.. హాట్ క్యాప్షన్‌తో వైరల్ అవుతున్న పిక్స్!



టాలీవుడ్ లక్కీ బ్యూటీ సీరత్ కపూర్ తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. లగ్జరీ బ్లషింగ్ పింక్ ఫ్లోరల్ శాటిన్ అవుట్‌ఫిట్‌లో ఆమె పంచుకున్న ఫొటోస్ కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఒక క్రేజీ హాట్ క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన ఈ ఫోటోషూట్ పిక్స్ ప్రస్తుతం నెట్టింట భారీగా వైరల్ అవుతున్నాయి. పింక్ అవుట్‌ఫిట్‌లో మైండ్ బ్లాకింగ్ లుక్స్: సీరత్ కపూర్ తన లేటెస్ట్ ఫొటో షూట్ కోసం ఎంచుకున్న డ్రెస్ చాలా కొత్తగా, స్టైలిష్‌గా ఉంది. మూడు మ్యాచింగ్ కో-ఆర్డినేట్స్ ఉన్న ఈ లగ్జరీ బ్లషింగ్ పింక్ లాంజ్‌వేర్ సెట్‌లో ఆమె మెరిసిపోతోంది. ఇక ఫ్లోరల్ శాటిన్ బస్టీయర్ క్రాప్ టాప్, హై-వ్యాస్ట్ రిలాక్స్‌డ్ షార్ట్స్, దానికి తోడు లాంగ్-లైన్ ఫ్లూయిడ్ డ్రేప్ రోబ్ వేసుకుని ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. సూర్యుడు మూడ్ సెట్ చేయట్లేదు.. క్రేజీ క్యాప్షన్: ఈ హాట్ అండ్ క్లాసీ ఫోటోలను షేర్ చేస్తూ సీరత్ కపూర్ పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. "నో బేబీ.. సూర్యుడు ఇక్కడ మూడ్‌ని సెట్ చేయడం లేదు, నాలోని మేషరాశి ఎనర్జీని రీఫ్యూయల్ చేస్తున్నాడు" అంటూ చాలా ఇంట్రెస్టింగ్‌గా రాసుకొచ్చింది. ఇక ఈ సన్‌కిస్డ్ లుక్స్‌లో ఆమె గ్లామర్ నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. సీరత్ కపూర్ టాలీవుడ్ ప్రేక్షకులకు చాలా సుపరిచితురాలు. 2014లో బాలీవుడ్ సినిమా 'జిద్'తో కెరీర్ స్టార్ట్ చేసినా.. టాలీవుడ్‌లో శర్వానంద్ సరసన చేసిన 'రన్ రాజా రన్' సినిమాతో ఈమెకు సూపర్ క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత 'రాజుగారి గది 2', 'కృష్ణ అండ్ హిజ్ లీల' వంటి సినిమాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక లాక్‌డౌన్ టైమ్‌లో ఈమె నటించిన 'మా వింత గాథ వినుమా' ఓటీటీలో రిలీజ్ అయి ఆకట్టుకుంది. ప్రస్తుతం సీరత్ కపూర్ చేతిలో కొన్ని ఆసక్తికరమైన సినిమాలు ఉన్నాయి. అందులో 'జాతస్య మరణం ధ్రువం', అలాగే 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే ప్రాజెక్టులు విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఇవే కాకుండా, టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ 'దిల్ రాజు ప్రొడక్షన్స్' బ్యానర్‌లో కూడా ఆమె కొన్ని క్రేజీ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, షూటింగ్‌లకు సన్నాహాలు చేస్తున్నట్లు టాక్. ఒకవైపు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు ఇలాంటి క్రేజీ ఫొటో షూట్లతో సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటోంది సీరత్ కపూర్. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ బ్యూటీ.. రాబోయే చిత్రాలతో టాలీవుడ్‌లో ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి.

# నెట్టింట ప్రగ్యా క్రేజ్.. ఆఫర్స్ తెచ్చిపెట్టేనా?




కంచె సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ ఆ తరువాత జెట్ స్పీడ్ లోనే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ని సంపాదించుకుంది. క్యూట్ లుక్స్ తో మెప్పించిన ఈ భామ ప్రస్తుతం ట్విట్టర్ లో గట్టిగా ట్రెండ్ అవుతోంది. తన లేటెస్ట్ ఫిట్నెస్ తో కుర్రకారును ఫిదా చేస్తోంది. 35 నుంచి 40 ఏళ్ల వయసున్న హీరోయిన్లలో బెస్ట్ ఫిట్నెస్ మెయింటైన్ చేస్తున్న నటిగా నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. చాలా రోజుల తర్వాత ఆమె పేరు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ఈ రేంజ్ లో వినిపిస్తోంది. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆమెను ఏకంగా శ్రద్ధా కపూర్, పూజా హెగ్డే, తాప్సీ లాంటి స్టార్ హీరోయిన్లతో పోలుస్తూ రకరకాల పోస్టులు పెడుతున్నారు. ఆ రేంజ్ స్టార్స్ తో కాంపిటీషన్ ఇస్తూ ఫిట్నెస్ విషయంలో ప్రగ్యా వాళ్లందరినీ ఈజీగా డామినేట్ చేస్తోందనే కామెంట్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ బజ్ ను పర్ఫెక్ట్ గా వాడుకునే పనిలో పడిన ఈ భామ.. తన అకౌంట్స్ లో మరిన్ని గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫాలోవర్స్ అటెన్షన్ ను ఎక్కడా తగ్గకుండా చూసుకుంటోంది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా అసలు పాయింట్ దగ్గరే ఒక పెద్ద క్వశ్చన్ మార్క్ కనిపిస్తోంది. ఇంటర్నెట్ లో నెటిజన్ల నుంచి ఇంత క్రేజ్ వస్తున్నా ఇదంతా సినిమా ఆఫర్స్ గా ఎందుకు మారడం లేదు అన్నదే అసలు లాజిక్. డిజిటల్ వరల్డ్ లో ఎంత హడావుడి ఉన్నా దాన్ని బిగ్ స్క్రీన్ మీదకు తీసుకెళ్లే సరైన ప్రాజెక్ట్ చేతిలో లేకపోతే ఆ క్రేజ్ కు పెద్దగా వాల్యూ ఉండదు. వర్క్ లోకి మారనంత వరకు ఈ ట్రెండింగ్స్ అన్నీ టెంపరరీగానే మిగిలిపోతాయి. జనరల్ గా సినిమా ఇండస్ట్రీలో నటీమణులకు అవకాశాలు రావాలంటే కేవలం పర్ఫెక్ట్ ఫిజిక్, గ్లామర్ ఒక్కటే ఉంటే సరిపోదు. వాళ్ల లక్, టైమింగ్, కరెక్ట్ కాంటాక్ట్స్ కూడా పక్కాగా వర్కౌట్ అవ్వాలి. ప్రగ్యా కెరీర్ గ్రాఫ్ చూస్తే ఇవన్నీ కొంచెం స్లో అయినట్లే అనిపిస్తోంది. కెరీర్ స్టార్టింగ్ లో వచ్చిన హిట్స్ ను సరైన విధంగా వాడుకుని నెక్స్ట్ లెవెల్ కు వెళ్లడంలో ఆమె కాస్త వెనుకబడిందనే టాక్ ఇండస్ట్రీలో ఉంది. టాలెంట్ ఉన్నా టైమ్ కలిసిరాకపోవడమే ఆమెకు పెద్ద మైనస్. ఇలాంటి గడ్డు కాలంలో కేవలం ఫోటోషూట్స్ కే పరిమితం కాకుండా తన యాక్టింగ్ స్కిల్స్ కు స్కోప్ ఉన్న స్ట్రాంగ్ కంటెంట్ వైపు ఆమె అడుగులు వేయాలి. సోషల్ మీడియాలో వచ్చిన ఈ ఫ్రెష్ అటెన్షన్ ను ఎవరైనా మేకర్స్ కరెక్ట్ గా నోటీస్ చేసి ఒక మంచి క్యారెక్టర్ ఆఫర్ ఇస్తే తప్ప ఆమె కెరీర్ మళ్లీ ఫామ్ లోకి రాదు. గ్లామర్ పాత్రలతో పాటు పెర్ఫార్మన్స్ ఓరియెంటెడ్ కథలు ఎంచుకోవడం ఇలాంటి టైమ్ లో చాలా ముఖ్యం. ఇక ప్రగ్యా జైస్వాల్ తన మైండ్ బ్లోయింగ్ ఫిట్నెస్ తో ఒక సెన్సేషన్ అయితే క్రియేట్ చేసింది. ఆడియన్స్ ఫోకస్ మొత్తం తన వైపు తిప్పుకోవడంలో పక్కాగా సక్సెస్ అయింది. అయితే ఈ ఆన్ లైన్ ట్రెండ్స్ రియల్ లైఫ్ ఆఫర్స్ గా ఎప్పుడు మారుతాయో చూడాలి. ఏదైనా మంచి బ్యానర్ లో సరైన ప్రాజెక్ట్ పడితే మాత్రం ఈ బ్యూటీ మళ్లీ టాలీవుడ్ లో బిజీ అవ్వడం గ్యారెంటీ అని ఆమె ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు.



# లేస్ డ్రెస్‌లో దివి మ్యాజిక్... ఫోటోలు వైరల్!





తెలుగు టాప్ రియాలిటీ షో 'బిగ్ బాస్' ద్వారా ప్రేక్షకుల మనసు దోచుకున్న అందాల భామ దివి వాద్య. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు ఇప్పుడు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. డస్టీ పింక్ కలర్ లేస్ డ్రెస్‌లో దివి ఇచ్చిన హాట్ అండ్ క్యూట్ పోజులు అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. "కేవలం నీ గురించే ఆలోచిస్తున్నా!" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. కంటిచూపుతోనే కట్టిపడేస్తున్న దివి: దివి వాద్య తాజా ఫోటోషూట్‌లో సరికొత్త లుక్‌తో మెరిసిపోయింది. దట్టమైన పచ్చని చెట్ల మధ్య, ప్రకృతి ఒడిలో ఆమె దిగిన క్లోజప్ పోర్ట్రెయిట్ ఫోటోలు అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆమె సాఫ్ట్ అండ్ ఇంటెన్స్ కంటిచూపు, ఆ గ్లామరస్ ఎక్స్‌ప్రెషన్స్ చూసేవారిని మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇక ఈ ఫోటోల్లో దివి కాన్ఫిడెన్స్, నేచురల్ బ్యూటీ స్పష్టంగా కనిపిస్తూ నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. డ్రెస్ అండ్ ఫోటోగ్రఫీ స్పెషాలిటీ: ఈ స్పెషల్ షూట్ కోసం దివి డిజైనర్ డ్రెస్‌ను ఎంచుకుంది. 'ఇక డస్టీ పింక్ కలర్ లేస్ హాల్టర్-నెక్ టాప్‌లో ఆమె ఎంతో అందం గా కనిపిస్తోంది. ప్రముఖ ఫోటోగ్రాఫర్ హైందవి తన కెమెరా నైపుణ్యంతో దివి అందాన్ని మరింత అందంగా స్క్రీన్‌పై ఆవిష్కరించారు. ఇక ట్రెండీ అవుట్‌ఫిట్, పర్‌ఫెక్ట్ లైటింగ్ కలసి ఈ ఫోటోషూట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.

పుష్ప సాంగ్ నుండి బిగ్ బాస్ వరకు:

బిగ్ బాస్ హౌస్ నుండి బయటకు వచ్చిన తర్వాత దివి ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. వరుస ఆఫర్లతో బిజీగా మారిన ఈ బ్యూటీ, అల్లు అర్జున్ పాన్ ఇండియా మూవీ 'పుష్ప: ది రైజ్' సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిసి ప్రేక్షకులను అలరించింది. కేవలం సినిమాలే కాకుండా, క్రేజీ వెబ్ సిరీస్‌లు, బ్రాండ్ ప్రమోషన్లతో సోషల్ మీడియాలో ఎప్పుడూ హైపర్ యాక్టివ్‌గా ఉంటూ తన ఫ్యాన్ బేస్‌ను పెంచుకుంటోంది. వరుస ప్రాజెక్టులతో సూపర్ బిజీ: దివి కేవలం గ్లామర్ షోకే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం ఆమె చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'హనీ', 'నెపోలియన్ రిటర్న్స్', 'ష్..' చిత్రాలతో పాటు 'ద్రౌపతి 2' వంటి సినిమాలు ఆమె లైన్‌అప్‌లో ఉన్నాయి. ఇక ఈ చిత్రాలు ఆమెను టాలీవుడ్‌లో మరింత స్టార్ హీరోయిన్‌గా నిలబెడతాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. తనదైన ఆకర్షణీయమైన లుక్స్‌తో, నటనపై ఉన్న డెడికేషన్‌తో దివి వాద్య సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రత్యేక ముద్ర వేస్తోంది. గ్లామర్‌ను సరికొత్తగా ఆరబోస్తూ, కుర్రకారును ఆకట్టుకోవడంలో దివి ఎప్పుడూ ముందే ఉంటుంది. ఈ లేటెస్ట్ లేస్ డ్రెస్ ఫోటోషూట్ కూడా ఆమె క్రేజ్‌ను మరింత పెంచేసింది. రాబోయే సినిమాలతో దివి బాక్సాఫీస్ వద్ద మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం..


# గ్లామర్‌కు కొత్త అర్థం... అమైరా బాల్కనీ ఫోటోషూట్ వైరల్!

బాలీవుడ్ నటి అమైరా దస్తూర్ తన సరికొత్త గ్లామరస్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. బాల్కనీలో నిలబడి ఆమె ఇచ్చిన మైండ్ బ్లోయింగ్ పోజులు కుర్రకారు గుండెల్లో మంటలు పుట్టిస్తున్నాయి. కేవలం అందంతోనే కాకుండా, "నేను రాయలేని కవిత్వాన్ని జీవిస్తున్నాను" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కూడా నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెసివ్ కళ్లు, నేచురల్ గ్లామర్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ఆ విశేషాలు చూద్దాం. అదిరిపోయే అవుట్‌ఫిట్.. కళ్ళు తిప్పుకోలేరు: ఈ హాట్ ఫోటోషూట్‌లో అమైరా వేసుకున్న దుస్తులు చాలా స్టైలిష్‌గా ఉన్నాయి. ఆమె సింపుల్‌గా ఉండే తెల్లటి స్లీవ్‌లెస్ క్రాప్డ్ బ్రాలెట్‌తో పాటు, హై-వేస్టెడ్ లైట్-వాష్ డెనిమ్ షార్ట్స్ ధరించింది. ఈ షార్ట్స్‌కు ఉన్న రగ్గడ్ డిజైన్, పెద్ద పాకెట్స్ ఆమె లుక్‌కు మరింత బోల్డ్ అండ్ ట్రెండీ టచ్ ఇచ్చాయి.

ఇక దీనికి తోడు సింపుల్ గోల్డ్ హూప్ ఇయర్ రింగ్స్ పెట్టుకుని, తన వేవీ హెయిర్‌ను వదిలేసి అమైరా దేవకన్యలా మెరిసిపోతోంది. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కామెంట్ల వర్షం: అమైరా ఈ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడమే ఆలస్యం, నిమిషాల్లోనే వైరల్‌గా మారిపోయాయి. ఆమె లుక్‌కు ఫిదా అయిన అభిమానులు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "సూపర్ స్టైల్", "అద్భుతమైన అవుట్‌ఫిట్", "చాలా అందంగా ఉన్నావు", "అమేజింగ్ లుక్" అంటూ నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతూ సోషల్ మీడియా పేజీలను నింపేస్తున్నారు. ఇక ఈ బాల్కనీ పిక్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ ట్రెండ్ అవుతున్నాయి. ధనుష్ సరసన సూపర్ హిట్ బ్రేక్: అమైరా కెరీర్‌లో అతిపెద్ద బ్రేక్ వచ్చింది మాత్రం సౌత్ సినిమాతోనే. 2015లో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ సరసన 'అనేగన్' అనే రోమాంటిక్ థ్రిల్లర్‌లో నటించి బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది. ఇక ఈ సినిమాలో ఆమె నటనకు గాను బెస్ట్ డెబ్యూటెంట్ విభాగంలో ప్రతిష్టాత్మక 'సైమా' అవార్డు కూడా దక్కింది. ఆ సినిమాతో సౌత్‌లో ఆమెకు ఫ్యాన్ బేస్ బాగా పెరిగింది.

అన్ని భాషల్లోనూ సత్తా చాటుతూ:

అమైరా కేవలం హిందీ, తమిళ సినిమాలకే పరిమితం కాలేదు. తెలుగు, పంజాబీ భాషల్లోనూ వరుస సినిమాలు చేస్తూ బిజీగా మారింది. ఇక తెలుగులోనూ మెరిసిన ఈ బ్యూటీ, నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ మూవీ 'జోగి', ప్రభుదేవాతో 'బఘీర' మరియు 'బంబై మేరీ జాన్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లలో వైవిధ్యమైన పాత్రలు పోషించి వర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకుంది. అలాగే 'ఫుర్తీలా' వంటి పంజాబీ సినిమాలతో అక్కడి ప్రేక్షకులను కూడా అలరించింది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను కూడా చేయగలనని అమైరా దస్తూర్ నిరూపించుకుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అటు గ్లామర్ డోస్ పెంచుతూనే, ఇటు కెరీర్‌లో విభిన్న ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. ఈ బాల్కనీ ఫోటోషూట్ ద్వారా తనే ఒక కవిత్వంలా మారిపోయిన అమైరా, మున్ముందు మరెన్నో మంచి సినిమాలతో ప్రేక్షకులను అలరించాలని, మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.





EDITED, PRINTED AND OWNED BY.KOMMU RAJESH.PRINTED AT:SUNDAY PRINTING PRESS FLAT NO 363B 1ST FLOOR, MADHAVARAM NAGAR COLONY HYDERABAD TELANGANA 500072.PUBLISHED FROM.BUILDING NO 1-17-18-SVN COLONY, GUNTUR ANDHRA PRADESH 522006EDITOR, KOMMU RAJESH RNI TGTEL/26/A4369CELL 9676160442.9494034563.kommuraja@gmail.com